తెలుగు దినపత్రిక
# కబురు
KABURU TELUGU DAILY
RNI APTEL/1999/00110
సంపుటి : 22 సంచిక : 297 | శుక్రవారం అక్టోబర్ 04 2024 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5

మీ రాజకీయ ప్రయోజనాల కోసం నా పేరు వాడొద్దు: రకుల్

8 లో..

ఇదండీ..కబురు..




# క్రీడారంగానికి ప్రత్యేక ప్రోత్సాహం

## క్రీడా వర్సిటీతో అందరికీ శిక్షణ ఇప్పిస్తాం

» గడచిన పదేళ్లలో క్రీడారంగాన్ని విస్మరించారు
» యువతను సన్మార్గంలో నడిపేందుకు క్రీడలకు ప్రోత్సాహం
» సిఎం కప్ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి




కబురు న్యూస్, హైదరాబాద్ అక్టోబర్ 3

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత బిఆర్ఎస్ ప్రభుత్వం క్రీడలను నిర్లక్ష్యం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. సీఎం కప్ క్రీడా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ. రాబోయే రోజుల్లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు అకాడమిని ప్రారంభించి క్రీడాకారులందరికీ శిక్షణ ఇస్తామని తెలిపారు. చదువే కాదు.. క్రీడల్లో రాణించినా మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. మతాలకు అతీతంగా దేశ ప్రతిష్ఠను పెంచేది క్రీడాకారులేనని సీఎం అన్నారు. ఏళ్ల క్రితం హైదరాబాద్‌లో ఏషియన్ గేమ్స్ సహా ఇతర క్రీడలు నిర్వహించారు. అప్పుడు హైదరాబాద్ దేశానికి ఆదర్శంగా నిలిచింది. కానీ, తెలంగాణ వచ్చిన తర్వాత క్రీడలను నిర్లక్ష్యం చేశారు. యువత డ్రగ్స్, గంజాయికి అలవాటు పడుతుంటే ఎంతో బాధపడ్డాం. కానీ, ప్రస్తుతం క్రీడలకు హైదరాబాద్ హబ్‌లా మారేలా కృషి చేస్తున్నాం. బాక్సింగ్‌లో రాణిస్తున్న నిఖత్ జరీన్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చాం. క్రికెటర్ సిరాజ్‌కు ఉద్యోగం ఇచ్చి.. ఆర్థికంగా ఆదుకునే ప్రయత్నం చేశాం. గతంలో రాష్ట్రానికి, దేశానికి పేరు తెచ్చిన క్రీడాకారుల కుటుంబాలను ఆదుకుంటాం. అండర్-17 క్రికెట్ టీమ్‌ను తెలంగాణ ప్రభుత్వం దత్తత తీసుకుంది. ఒలింపిక్స్‌లో భారత్ పరిస్థితిని యువత ఆలోచించాలి. అందుకే తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. కులం, మతంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ కలిసే చోటు క్రీడా మైదానాలు మాత్రమే అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 25 ఏళ్ల కింద క్రీడల్లో హైదరాబాద్ దేశానికే ఆదర్శంగా నిలిచింది.. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడలను నిర్లక్ష్యం చేసిందని సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. గత ప్రభుత్వ హయాంలో క్రీడకారులను నిర్లక్ష్యం చేస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాలు, ప్రోత్సాహకాలు ఇచ్చి గౌరవించామన్నారు. ఇదే ఎల్బీ స్టేడియంలో వేలాది మంది అభిమానుల మధ్య నేను ప్రమాణస్వీకారం చేశాను. నాపై అప్పుడు ఎలాంటి అభిమానం చుపించారో.. ఇప్పుడు అదే అభిమానం చూపించడం సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో తెలంగాణ ని స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తాం. గతంలో జాతీయ, అంతర్జాతీయ పోటీలు జరిగేవి.. కానీ తెలంగాణ ఏర్పడ్డాక గత పదేళ్లలో క్రీడావ్యవస్థ దిగజారిపోయింది. చిన్నారులు మత్తు ముందుకు బానిసలు అవుతున్నారు. టాలెంట్ ఉన్నవాళ్లు ప్రతి గ్రామంలో ఉన్నారు.. వాళ్ళకి సరైన ప్రోత్సహం మేము అందిస్తాం. హైదరాబాద్ ఫుట్ బాల్‌కి తిరిగి పూర్వవైభం తీసుకొస్తాం. అండర్ -17 నేషనల్ ఫుట్ బాల్ టీమ్‌ని రాష్ట్ర ప్రభుత్వం దత్తత తీసుకుంటుంది.. వాళ్ళని అంతర్జాతీయ ప్లేయర్లుగా తీర్చిదిద్దుతాం. తెలంగాణలో త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని నిర్మించబోతున్నాం. కులమతాలకు అతీతంగా ఉండేవే క్రీడలు, క్రీడామైదానాలు. అందుకె పాడైపోయిన స్టేడియాలను సరికొత్తగా రేనోవేషన్ చేస్తున్నాం. త్వరలోనే ఎల్బీ స్టేడియాన్ని రేనోవేషన్ చేస్తాం. యువత మత్తు జోలికి పోకుండా.. క్రీడల్లోకి రావాలని కోరుతున్నా అని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా తన వ్యక్తిగత అనుభవాలను ప్లేయర్లతో పంచుకున్న సీఎం రేవంత్ రెడ్డి.. కష్టపడితే ఏదైనా సాధించొచ్చని ఆటగాళ్లకు సూచించారు. ఇందుకు తాను, ప్రధాని మోడీనే నిదర్శమని వ్యాఖ్యానించారు.

# కెటిఆర్‌ను వదలని కొండా సురేఖ

» కెసిఆర్ కనిపించకపోవడంలో కెటిఆర్ పాత్ర
» ఫామ్‌హౌజ్‌లో ఏమైనా చేశాడేమోనని అనుమానం
» ప్రజలు పోలీస్ స్టేషన్ వెళ్లి కేసు పెట్టాలని సూచన
» మరోమారు ఘాటు విమర్శలు చేసిన మంత్రి

కబురు న్యూస్, సిద్దిపేట,అక్టోబర్ 3

భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్ పర్యటన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకొని తమపై పిచ్చి రాతలు రాయిస్తున్నారని మండిపడ్డారు. తొమ్మిది హామీలు అమలు చేస్తే పదో హామీ ఎందుకు ఇవ్వలేదని కేటీఆర్ ప్రశ్నిస్తున్నారు. పదవీ కాంక్షతో కేసీఆర్‌ని కేటీఆరే ఏదో చేశారన్న ప్రచారం జరుగుతోంది. కేటీఆర్ సీఎం అనుకుని పిచ్చి నిర్ణయాలు తీసుకున్నారు.

2 లో



## బిఆర్ఎస్ నేతల ఇష్టారాజ్యంగా ఆరోపణలు

# మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు

కబురు న్యూస్, హైదరాబాద్ అక్టోబర్ 3

తెలంగాణలో బీఆర్ఎస్ నేతలు ఇష్టానుసారం అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు ఆరోపించారు. రాహుల్‌పై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను కావాలనే ప్రభుత్వం బద్నాం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో కొండా సురేఖ వ్యాఖ్యలపై పీసీసీ స్పందనే తన స్పందన అని చెప్పుకొచ్చారు. అలాగే, హైడ్రాకు ఆర్డినెన్స్‌కు ఆమోదం లభించిందన్నారు. మంత్రి శ్రీధర్ బాబు గురువారం మీడియాతో మాట్లాడుతూ.. మూసీ అభివృద్ధి, సంక్షేమంపై చాలెంజ్ చేస్తాం.



2 లో

# రుణమాఫీ కాని రైతుల సమస్యను త్వరలో పరిష్కరిస్తాం: పొన్నం ప్రభాకర్

కరీంనగర్: ఫ్యామిలీ డిజిటల్ కార్డు వల్ల ఎన్నో లాభాలు ఉంటాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జిల్లాలోని కరీంనగర్ రూరల్ మండలం తాహెర్ కొండాపూర్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇది కార్డులో లేని వివరాలు తెలుసుకొని నమోదు చేయించే కార్యక్రమని చెప్పారు. కొత్తగా పెళ్లి అయిన వారి, మృతి చెందిన వారి వివరాలు అప్డేట్ చేయనున్నట్లు పేర్కొన్నారు. 'వన్ స్టేట్ వన్ కార్డు'లో భాగంగా ఈ కార్యక్రమం లాంచ్ చేస్తున్నట్లు చెప్పారు.



"ఇంటి మహిళను గృహ యజమానిగా గుర్తించనున్నాం. ఇదే కార్డు ఆరోగ్యానికి, రైతు బంధు, బీమా తదితరాలకు ఉపయోగపడుతుంది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో డిజిటల్ కార్డు సర్వే ప్రారంభిస్తున్నాం. కుటుంబానికి ఒక గుర్తింపు ఉండేలా కార్డు తయారు చేస్తాం. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల సమస్యను త్వరలో పరిష్కరిస్తాం. గత ప్రభుత్వంలో మాదిరి రూ.లక్షను నాలుగు సార్లు ఇవ్వడం లేదు. ఒకేసారి మాఫీ ఇచ్చాం. రేషన్ కార్డు లేక రుణమాఫీ ఆగిన వాళ్లకు అతి త్వరలో తప్పకుండా వస్తుంది. ఈ డిజిటల్ కార్డు వల్ల ఎన్నో లాభాలు ఉంటాయి. మీ కుటుంబ ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు ఇందులో పొందుపరుస్తారు. ఈ కార్యక్రమంలో లోటుపాట్లు ఏమైనా ఉంటే అధికారులకు ధైర్యంగా చెప్పవచ్చు. మిగతా ప్రాంతాల్లో సమస్య లేకుండా చూసుకునే అవకాశం ఉంటుంది" అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు

» సింగిల్ బెంచ్ తీర్పు కొట్టివేత కుదరదన్న హైకోర్టు
» 24న వాదనలు వింటామని స్పష్టం చేసిన ధర్మాసనం

కబురు న్యూస్, హైదరాబాద్ అక్టోబర్ 3




తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు మరో కీలక పరిణామం జరిగింది. గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేయాలన్న అసెంబ్లీ సెక్రటరీ అభ్యర్థనను హైకోర్టు డివిజన్ బెంచ్ తిరస్కరించింది. స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ విషయంపై ఈనెల 24న వాదనలను వింటామని తెలిపింది. బీఆర్ఎస్ పార్టీ తరపున విజయం సాధించి అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సహా పలువురు వేసిన పిటిషన్ హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. నెల రోజులు క్రితం సెప్టెంబర్ 9న విచారణ సందర్భంగా అసెంబ్లీ సెక్రటరీకి, స్పీకర్‌కు సూచనలు చేసింది.

02

## భద్రత లేకుండా మూసీ వద్దకు వెళ్దాం..

# సీఎం రేవంత్‌కు ఈటల సవాల్

కబురు న్యూస్, హైదరాబాద్ అక్టోబర్ 3



మూసీలో ఆక్రమణల తొలగింపు అంశం రాజకీయ పార్టీల మధ్య కాక పుట్టిస్తోంది. సవాళ్లు, ప్రతి సవాళ్లతో అధికార.. విపక్ష నేతలు మాటల యుద్ధానికి దిగుతున్నారు. గురువారం సికింద్రాబాద్‌లోని కంటోన్మెంట్‌లో కుటుంబ డిజిటల్ కార్డుల ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. భద్రత లేకుండా మూసీ పరివాహక ప్రజల వద్దకు వెళదామని సవాల్ విసిరారు."సీఎం రేవంత్ పాలన బాగుందని ప్రజలు అంటే.. రాజకీయల నుంచి తప్పుకొంటా. సీఎం మంచిపని చేస్తున్నారని అంటే ముక్కు నేలకు రాస్తా. ఉప్పల్, రామంతాపూర్, అంబర్‌పేట ఎక్కడికి వస్తారో సీఎం చెప్పాలి. హరీశ్‌రావు రాసిస్తే నేను మాట్లాడతానని అనడం అవగాహన రాహిత్యం" అని ఈటల రాజేందర్ మండిపడ్డారు.

# పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్ రెడ్డి పాలన

## ఫార్మాసిటీ భూముల్లో రియల్ దందా

## మాజీమంత్రి హరీష్ రావు ఆరోపణ



02

కబురు న్యూస్, హైదరాబాద్ అక్టోబర్ 3

రేవంత్ రెడ్డి పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. హైదరాబాద్ సమీపంలో ఫార్మాసిటీ కోసం 15 వేల ఎకరాలు మాజీ సీఎం కేసీఆర్ సేకరించారని గుర్తుచేశారు. ఫార్మాసిటీకి అన్ని అనుమతులు వచ్చిన చోట ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు.. దీని కోసం రేవంత్ ప్రభుత్వం పచ్చని పొలాలు లాక్కుంటుందని ఆరోపణలు చేశారు. 'రేవంత్ రెడ్డి నువ్వు రియల్ ఎస్టేట్ బ్రోకర్ వా.. లేక ముఖ్యమంత్రివా' అని సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో హరీష్‌రావు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.

# కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు ఊరట

## ఐదురోజుల బెయిల్ మంజూరు చేసిన కోర్టు

కబురు న్యూస్, హైదరాబాద్ అక్టోబర్ 3



ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు రంగారెడ్డి కోర్టులో కాస్త ఊరట లభించింది. జానీ మాస్టర్‌కు కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కేవలం ఐదు రోజులు మాత్రమే బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. నేషనల్ అవార్డు తీసుకోవడం కోసం జానీ మాస్టర్‌కు ఈనెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు రంగారెడ్డి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రస్తుతం చంచల్ గూడా జైలులో జానీ మాస్టర్ ఉన్నారు. బెయిల్ మంజూరు అయిన నేపథ్యంలో 6న జైలు నుంచి విడుదలయ్యే అవకాశం ఉంది. కాగా.. అసిస్టెంట్ మహిళా కొరియోగ్రాఫర్‌పై లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కుంటున్న జానీ మాస్టర్‌ను గత నెలలో పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

2లో..

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# పంటల బీమాలో 'ప్రైవేటు'తో ప్రయోజనం లేదు!

అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఒక సమగ్ర పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తామని చెప్పింది. ఈ హామీ అమలులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం తనదైన ప్రత్యేక ముద్రతో కూడిన పంటల బీమా పథకాన్ని తిరిగి ప్రారంభించి రైతాంగాన్ని ఆదుకోవాలని నిర్ణయించింది. అంతేకాకుండా భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా పంటల బీమా పథకానికి రైతులు చెల్లించాల్సిన ప్రీమియం వాటాను కూడా ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని నిర్ణయించింది. రైతు మీద ఎలాంటి ఆర్థిక భారం లేకుండా అన్ని పంటలను పూర్తిస్థాయిలో సమగ్ర పంటల బీమా పథకం కింద తీసుకొచ్చి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు జరిగే నష్టానికి పరిహారాన్ని చెల్లించి రైతులలో ఆత్మస్థైర్యాన్ని నింపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుంది.
తంలో అమలు చేసిన వివిధ పంట బీమా పథకాలను మూడు దశలుగా విశ్లేషిద్దాం. మొదటి దశ (1985 -2000). 1972లో మొదటిసారి గుజరాత్ రాష్ట్రంలో పత్తి పంటతో మొదలైన పంటల బీమా పథకం ప్రయోగాత్మకంగా పరిమితంగా కొన్ని రాష్ట్రాల్లో అమలు చేసిన తర్వాత పూర్తిస్థాయి పంటల బీమా పథకం 1985లో మొదలైంది. ఆనాటి ప్రధాని రాజీవ్‌గాంధీ ముందు చూపుతో సమగ్ర పంటల బీమా పథకాన్ని తీసుకువచ్చి 16 ప్రధాన వ్యవసాయ రాష్ట్రాలకు విస్తరింపజేసి అన్ని ప్రధాన పంటలకు వర్తింపచేశారు. ఈ పథకాన్ని ప్రభుత్వ రంగంలోని జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అమలు చేశారు. ఈ కాలంలో సుమారు ఏడు కోట్ల 63 లక్షల మంది రైతులు పంటల బీమా పరిధిలోకి రావడంతో పాటు సుమారుగా రూ.2,319 కోట్ల నష్టపరిహారాన్ని పొందారు. అయితే మొత్తం బీమా సంస్థకు చెల్లించిన ఇన్సూరెన్స్ ప్రీమియం కేవలం రూ.400 కోట్లు మాత్రమే. అనగా రైతులు, రైతుల తరఫున ప్రభుత్వం చెల్లించిన మొత్తం ప్రీమియం కంటే వచ్చిన నష్టపరిహారం సుమారుగా ఐదు రెట్లు ఎక్కువ.రెండవ దశ (2001--2015). పంటల బీమా పరిధిని మరింత విస్తరించి జాతీయ వ్యవసాయ బీమా పథకం 2001లో భారతదేశ వ్యాప్తంగా అన్ని ప్రధాన పంటలకు విస్తరింప చేశారు. ఈ దశలోనే పంటల బీమా అమలు ప్రాముఖ్యతను గుర్తించి 'భారత వ్యవసాయ బీమా కంపెనీ' (అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా) అనే స్వతంత్ర సంస్థను 2002లో ఏర్పాటు చేసి ఈ సంస్థ ద్వారా ఈ జాతీయ పంటల బీమా పథకాన్ని 2015 వరకు అమలు చేశారు. అయితే, ఈ దశలోనే 2010%-%-11 ప్రాంతంలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీతో పాటు ప్రైవేట్ సంస్థలను కూడా పంటల బీమా రంగంలోకి తీసుకురావాలని నిర్ణయించారు. ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ప్రయోగాత్మకంగా రెండు సంవత్సరాలు (2011%--12, 2012-%-13) కొన్ని రాష్ట్రాల్లో కొన్ని పంటలకు సవరించిన పంటల బీమా పథకాన్ని అమలు చేశాక, ఈ పథకం ద్వారా రైతులకు ప్రయోజనం లేదని భావించి 2013లో నిలిపివేశారు. ఎందుకంటే ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో అమలైన సవరించిన పంటల బీమా పథకం ద్వారా చెల్లించిన నష్టపరిహారం కేవలం రూ.237కోట్లు మాత్రమే, కానీ సేకరించిన ప్రీమియం దాదాపు రూ.825కోట్లు. మరోవైపు భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అమలు చేసిన జాతీయ వ్యవసాయ బీమా పథకం కింద ఇదే కాలంలో సేకరించిన ప్రీమియం రూ.7,565 కోట్లు అయితే రైతులకు చెల్లించిన నష్టపరిహారం రూ.25,000 కోట్లు.మూడవ దశ (2016 నుండి నేటి వరకు). కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చాక 2016లో ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని భారీ అంచనాలతో తీసుకువచ్చారు. ఈ పథకం అమలులో పంట బీమా రంగంలోకి ప్రైవేటు సంస్థలకు గేట్లు తెరిచారు. అంతేకాకుండా బీమా సంస్థలకు చెల్లించే ప్రీమియాన్ని గతంలో అమలు చేసిన పంట బీమా పథకాలతో పోలిస్తే రెండు నుంచి మూడు రెట్లు పెంచారు. దీని ఫలితంగా ఎన్నో ప్రైవేట్ సంస్థలు పంటల బీమా రంగంలోకి పుట్టగొడుగుల్లాగా పుట్టుకొచ్చాయి. ఇటీవల ఒక నివేదికలో 2020%-%-23 మధ్య కాలంలో భారతదేశంలో మొత్తం ప్రీమియం రూపంలో సుమారు రూ.28,000 కోట్లు వివిధ బీమా సంస్థలకు చెల్లించినట్లు, అదే కాలంలో కేవలం రూ.8000 కోట్లు మాత్రమే ఈ బీమా సంస్థలు రైతులకు నష్టపరిహారం రూపంలో తిరిగి చెల్లించినట్లుగా తెలుస్తుంది. దీన్నిబట్టి పంటల బీమా రంగంలోని ప్రైవేట్ సంస్థలు ఏ విధంగా లాభాలు ఆశిస్తున్నాయో అర్థం అవుతున్నది.తెలంగాణ రాష్ట్రంలో కూడా ఈ పథకాన్ని 2019 వరకు నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో అమలు చేసింది. ఒకవైపు రైతుల వాటా మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం వాటాల కింద ప్రీమియం రూపంలో ఈ ప్రైవేట్ సంస్థలకు వేల కోట్లు ధారాదత్తం చేయబడ్డాయి. ఇదే కాలంలో, తెలంగాణలోని రైతాంగానికి ఏ ప్రైవేట్ సంస్థ కూడా ఎలాంటి పంట నష్టపరిహారం ఆశించినట్టుగా చెల్లించలేదు. దీనిని నెపంగా చూపించి ప్రత్యామ్నాయ పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టకుండా నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం 2020 నుంచి పంటల బీమా పథకాన్ని పూర్తిగా నిలిపివేసింది.తెలంగాణ ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన పంటల బీమా పథకానికి ఈ అనుభవాలను ఒక గీటురాయిగా పరిగణించాలి. ప్రస్తుత వానాకాలంలో వరి పంట సుమారు 50 లక్షల ఎకరాలు, పత్తి 42 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 5 లక్షల ఎకరాలు, మిరప లక్ష ఎకరాలలో సాగు చేస్తున్నట్టుగా అంచనాలు వస్తున్నాయి. దీని ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన నూతన పంటల బీమా పథకానికి రైతుల వాటా కింద సుమారు రూ.1600కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద మరో రూ.2000కోట్లు%-% మొత్తం సుమారు రూ.3600 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం బీమా సంస్థలకి ప్రీమియం రూపంలో ప్రతి ఏటా చెల్లించాలి. అదేవిధంగా ఒకవేళ కేంద్రం రూపొందించిన ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని యథావిధంగా అమలు చేసినట్లయితే కేంద్ర ప్రభుత్వం వాటా కింద మరో రూ.2000కోట్లు బీమా సంస్థలకు నేరుగా చెల్లించాలి. అనగా తెలంగాణలో రైతాంగాన్ని పూరిస్థాయిలో పంటల బీమా పరిధిలోకి తీసుకురావాలంటే సుమారుగా రూ.5,600కోట్లు మొత్తం ప్రీమియం రూపంలో బీమా సంస్థలకు చెల్లించాలి. అయితే ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని యథావిధిగా అమలు చేసి ప్రీమియంలో కేంద్ర ప్రభుత్వ వాటా కూడా పొందాలంటే ప్రైవేట్ రంగ సంస్థలను విధిగా భాగస్వామ్యం చేయాలి. టెండర్ విధానం ద్వారా బీమా సంస్థలను ఎంపిక చేయాలి. ఇదే జరిగితే ప్రైవేట్ సంస్థలు సాధ్యమైనంత వరకు తక్కువ ప్రీమియంతో టెండర్ దక్కించుకొని పంటల బీమా పథక ప్రయోజనాలను రైతాంగానికి దక్కకుండా వివిధ అనైతిక పద్ధతులు, షరతులతో రైతాంగాన్ని నట్టేట ముంచే ప్రమాదం ఉంది. గతంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో అమలైన పంటల బీమా పథకాలు చెబుతున్న అనుభవాలు కూడా ఇవే.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న పంటల బీమా పథకం ద్వారా రైతులకు నిజంగా ప్రయోజనం జరగాలంటే ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని పూర్తిగా నిషేధించి రాష్ట్ర ప్రభుత్వం తనదైన ప్రత్యేక ముద్రతో ఈ పథకాన్ని భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అమలు చేయాలి. ఒకవేళ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా పంటల బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటే కేంద్ర ప్రభుత్వం ప్రీమియంలోని తన వాటాను ఈ ప్రభుత్వ రంగ బీమా సంస్థకు చెల్లించదు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు

మొదటిపేజీ తరువాయి
నెల రోజుల్లో నిర్ణయం తీసుకొని షెడ్యూల్‌ను బెంచ్ ముందు ఉంచాలని ఆదేశించింది. లేకుంటే సుమోటోగా తామే ఓ నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అసెంబ్లీ సెక్రటరీ హైకోర్టు డివిజన్ బెంచ్‌కు వెళ్లారు. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని కోరారు. ఇప్పటికిప్పుడు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం కుదరని చెప్పేసింది. తదుపరి వాదనలు 24న వింటామని పేర్కొంది. హైకోర్టులో ఏప్రిల్‌లో పిటిషన్ వేసే నాటికి బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు పార్టీ మారారు. వాళ్లపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలంటూ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ఆగస్టు 7న వాదనలు పూర్తి అయ్యాయి. తర్వాత తీర్పును హైకోర్టు సింగిల్ బెంచ్ రిజ్వర్ చేసింది. సెప్టెంబర్ 9న సోమవారం నాడు తీర్పు వెలువరించింది. ఏప్రిల్ తర్వాత మరికొందరు ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలా వెళ్లి వచ్చిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని పీఏసీ ఛైర్మన్‌గా కూడా చేయడం ఈ మధ్య కాలంలో పెను వివాదానికి కారణమైంది. ఆ టైంలో కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ మధ్య తీవ్ర వార్ నడిచింది. తాను ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నానంటూ అరికెపూడి వాదిస్తుంటే...లేదు పార్టీ మారుతున్నట్టు కండువా కూడా మార్చుకున్నారని ఆరోపిస్తూ వస్తోంది బీఆర్ఎస్. ఈ వివాదాలు నడుస్తుండగానే అసెంబ్లీ సెక్రటీ అభ్యర్థను హైకోర్టు డివిజన్ బెంచ్ తిరస్కరించడంతో తర్వాత ఏం జరగనుందనే ఆసక్తి మొదలైంది.

# కేటీఆర్‌ను వదలని కొండా సురేఖ

మొదటిపేజీ తరువాయి
భారాస ఓడిపోవడానికి ప్రధాన కారణం ఆయనే. బడ్జెట్ రోజు అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్ మళ్లీ కనిపించలేదు. ఫామ్‌హౌస్‌లో ఏం చేస్తున్నారో తెలియదు. గజ్వేల్‌లో కేసీఆర్ కనిపించడంలేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం. పార్లమెంట్ ఎన్నికల్లో సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో భాజపా, భారాస మధ్య చీకటి ఒప్పందం జరిగింది. కవిత బెయిల్ కోసం ప్రధానితో మాట్లాడి ఒప్పందం చేసుకుని.. భారాస నుంచి భాజపాకు క్రాస్ ఓటింగ్ జరిగిందని కొండా సురేఖ ఆరోపించారు. కేటీఆర్‌కి పదవి కాంక్ష ఎక్కువ.. కేసీఆర్‌ని ఫామ్ హౌజ్ లోపల కేటీఆర్ గొంతు పిసికిండో ఏమోనన్న అనుమానం వస్తుందని తీన్మార్ మల్లన్న అంటున్నారు. మరీ తీన్మార్ మల్లన్న అనుమానం వ్యక్తం చేసినట్లు ఫామ్‌హౌస్‌లో ఏం జరిగిందో ఏమో కానీ.. గత కొన్ని రోజులుగా కేసీఆర్ మాత్రం కనిపించడం లేదని మంత్రి సురేఖ హాట్ కామెంట్స్ చేశారు. గజ్వేల్ నియోజవర్గం నుండి గెలిచిన వ్యక్తి సలహాలు ఇవ్వమంటే ఎక్కడున్నాడో తెలియదని.. మిమ్మల్ని గెలిపించిన గజ్వేల్ ప్రజలకు కష్టం వస్తే ఎవరికి చెప్పుకోవాలని కేసీఆర్‌ని నిలదీశారు. మా ఎమ్మెల్యే కనబడటం లేదని పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టమని కోరుతున్నానని గజ్వేల్ ప్రజలకు సూచించారు.మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ ఎందుకు గెలువలేకపోయిందనే భావన నాలో ఉందన్నారు. బీజేపీకి బీఆరెస్ అమ్ముడు పోవడం వల్లనే కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు మెదక్‌లో ఓటమి పాలయ్యారని ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవిత జైల్ నుండి బయటికి రావడం కోసం చీకటి ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. మెదక్‌లో మేము గెలువకున్న సరే బీజేపీని గెలిపించాలనే విధంగా బీఆర్ఎస్ పని చేసిందని మండిపడ్డారు. ప్రజలకు సేవ చేయడానికి మేము ముందుకు పోతుంటే.. పనికి మాలిన సోషల్ మీడియాతో కాంగ్రెస్ పార్టీపై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలుకావడానికి ప్రధాన కారణం కేటీఆర్ అని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. అధికారం కోల్పోయే సరికి కేటీఆర్‌కి మతిభ్రమించి తిరుగుతున్నాడని ఫైర్ అయ్యారు. హైడ్రా, మూసీ అంటూ కేటీఆర్ ప్రజల్లో ప్రలోభాలకు తెరలేపు తున్నాడని.. అస్సలు మూసీ ప్రక్షాళనకు తెరలేపింది బీఆర్ఎస్ పార్టీనేనని గుర్తు చేశారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకిస్తూ ప్రజల్లో ప్రలోభాలకు తెరలేపితే ఊపేక్షించబోమని.. ఇకనైనా ఒళ్ళు దగ్గర పెట్టుకుని ఉండాలని ఈ వేదిక ద్వారా హెచ్చరిస్తున్నానని సురేఖ వార్నింగ్ ఇచ్చారు.

# పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్ రెడ్డి పాలన

మొదటిపేజీ తరువాయి
ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం , ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. మూడు, నాలుగు వేల ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేసి.. మిగిలిన 10 వేల ఎకరాలను ప్లాట్లు చేసి అమ్మే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. బంగారం లాంటి పంట పండే భూముల్లో ఫార్మాసిటీ ఎందుకని నిలదీశారు. మూసీ సుందరీకణ పేరుతో పేదల ఇళ్లు కూలగొడుతున్నారని ధ్వజమెత్తారు. మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ' గరీబీ హఠావో అంటే రేవంత్ కిసాన్ హఠావో' అంటున్నారని విమర్శలు చేశారు.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యమని అడిగారు. వరంగల్ డిక్లరేషన్‌లో అసైన్డ్ భూములను పట్టా భూములు చేస్తానని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ముందు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రాహుల్ గాంధీ ఇప్పటికైనా స్పందించు.. రేవంత్‌కు మొట్టికాయలు వేసి హామీలు అమలు చేయించాలని కోరారు. బతుకమ్మ పండుగ వచ్చినా రైతుబంధు రాలేదని ఎద్దేవా చేశారు.రుణమాఫీ పేరుతో దేవుళ్లనూ రేవంత్ మోసం చేశారని అయ్యారు. న్యాల్‌కల్ మండలంలో తలపెట్టిన ఫార్మాసిటీ భూ సేకరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల భూములను లాక్కుంటే చూస్తూ ఊరుకోమని.. అవసరమైతే గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్తామని హెచ్చరించారు. రైతుల పోరాటానికి అండగా ఉంటామని హామీఇచ్చారు. రైతుల జోలికి వస్తే రేవంత్ రెడ్డికి బుద్ధి చెబుతామని వార్నింగ్ ఇచ్చారు. హైదరాబాద్ శివారులో ఫార్మాసిటీ ఏర్పాటు చేయకుంటే ఆ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలని కోరారు. మూసీని మంచిగా చేస్తానని ఫార్మాసిటీ పేరుతో మంజీరా నదిని కలుషితం చేస్తావా అని ప్రశ్నించారు. భూసేకరణను అడ్డుకుంటామని.... తానే వచ్చి బుల్డోజర లకు ఎదురు నిలబడతానని అన్నారు. రేవంత్‌ది నకిలీ ఇందిరమ్మ పాలన అని విమర్శించారు. సీఎం కుర్చీ కోసం రేవంత్ రెడ్డి అన్ని పార్టీలు మారారని విమర్శించారు. పోరంబోకు, రాళ్లురప్పల భూముల్లో ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలని.. వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేయొద్దని సీఎం రేవంత్‌రెడ్డిని హరీష్‌రావు కోరారు.

## కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు ఊరట
## ఐదురోజుల బెయిల్ మంజూరు చేసిన కోర్టు

మొదటిపేజీ తరువాయి
గోవాలో జానీ మాస్టర్‌ను రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గోవా స్థానిక కోర్టులో ప్రవేశపెట్టి పీటీ వారెంట్ తీసుకుని హైదరాబాద్‌కు తరలించారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లిలోని 13వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరిచారు. పోలీసులు సమర్పించిన ఆధారాలను పరిశీలించి, ఇరువర్గా ల వాదనలూ విన్న న్యాయమూర్తి.. అక్టోబరు 3వ తేదీ వరకు (14 రోజుల) రిమాండ్ విధించారు. దీంతో ప్రస్తుతం చంచల్‌గూడ్ జైలులో ఉన్నారు. అలాగే జానీ మాస్టర్‌ను కస్టడీకి కోరుతూ పిటిషన్ దాఖలవగా.. నాలుగు రోజుల పాటు కస్టడీ విధిస్తూ రంగారెడ్డి కోర్టు తీర్పునిచ్చింది. దీంతో జానీమాస్టర్‌ను నాలుగు రోజుల పాటు నార్సింగ్ పోలీసులు విచారించారు. పోలీసుల కస్టడీలో బాధితురాలే తనను వేధింపులకు గురిచేసిందంటూ జానీ మాస్టర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.అలాగే ఈ అంశానికి సంబంధించి జానీ మాస్టర్ భార్య సుమలత ఫిల్మ్ ఛాంబర్‌కు ఫిర్యాదు చేసింది. ఐదు సంవత్సరాలుగా నరకం అంటే ఏంటో తనకు చూపించిందని.. ఆత్మహత్యాయత్నం చేసుకునే వరకు తీసుకెళ్లిందని పేర్కొంది. తన భర్త జానీపై లేని పోనీ ఆరోపణలు చేసిన మహిళా కోరియోగ్రాఫర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు నేపథ్యంలో సుమలత నుంచి ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వివరణ కోరింది. దీంతో వివరణ ఇచ్చేందుకు నిన్న (బుధవారం) ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కమిటీ ముందు సుమలత హాజరయ్యారు. మహిళా కొరియోగ్రాఫర్‌కు సంబంధించిన అన్ని ఆధారాలను ఫిల్మ్ ఛాంబర్ కమిటీకి జానీ మాస్టర్ భార్య అందించారు. సుమలత దగ్గర నుంచి ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కమిటీ సభ్యులు వివరాలు సేకరించారు.

## బిఆర్ఎస్ నేతల ఇష్టారాజ్యంగా ఆరోపణలు
## మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు

మొదటిపేజీ తరువాయి

కత్తుల యుద్ధం చేస్తా అంటే నాలుగేళ్ల తర్వాత చేద్దాం. సంచులు మోసింది వాళ్లే అందుకే అదే గుర్తుకు వస్తుంది. ఇష్టారాజ్యం, అడ్డుగోలుగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారు. రాహుల్ గాంధీపై విమర్శలు చేస్తే సహించేది లేదు. పార్టీ పరంగా ఏమైనా తప్పులు జరిగితే రాహుల్ గాంధీ సరిచేస్తారు. అంతేగానీ మూసీ ప్రాజెక్ట్‌కు రాహుల్ గాంధీకి ఏం సంబంధం లేదు. రాహుల్ గాంధీపై విమర్శలు చేసి రెండు రోజులు వార్తల్లో ఉండాలి అనుకుంటున్నారు.డిజిటల్ కార్డుల కార్యక్రమంలో ఈటల రాజేందర్‌కు ఆహ్వానం అందలేదు అంటే సమీక్ష చేస్తాం. ప్రోటోకాల్ అంశంలో ఎక్కడ తప్పు జరిగిందో రివ్యూ చేస్తాం. ప్రభుత్వ కార్యక్రమాలను కావాలనే బీఆర్ఎస్ నేతలు బద్నాం చేస్తున్నారు. జహీరాబాద్‌కు పొల్యూషన్ కంపెనీలు అని హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. జహీరాబాద్‌కు త్వరలో హ్యుందాయ్ సంస్థ వస్తుంది.. అది పొల్యూషన్ సంస్థనా?. తెలంగాణ నుంచి కంపెనీలు తరలి వెళ్తున్నాయి అనేది అవాస్తవం. కొండా సురేఖ వ్యాఖ్యలపై పీసీసీ స్పందనే నా స్పందన. నేను ఇప్పటి వరకు ఎవరిని వ్యక్తిగతంగా విమర్శలు చేయలేదు.. చేయను. కేటీఆర్, బండి సంజయ్, హరీష్ రావు నా మిత్రులు. కేవలం రాజకీయ అభిప్రాయాలు మాత్రమే వేరు' అంటూ కామెంట్స్ చేశారు.

## చెంచులు, గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు
## రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానలబలోపేతం
## మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి

రాష్ట్రంలో మొట్టమొదటిసారి ఐటీడీఏ పరిధిలో నివసించే చెంచులు, గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పరిధిలో నివసించే చెంచులకు, గిరిజనులకు అందుతున్న వైద్య సేవలపై హైదరాబాద్‌లోని దామోదరం సంజీవయ్య భవన్ లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఐటీడీఏ పరిధిలోని ఉట్నూరు, భద్రాచలం, ఏటూరు నాగారం, మున్ననూరు లతో పాటు ఇతర జిల్లాలలో ఉన్న గిరిజనులకు, చెంచులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన విషయమై మంత్రి దామోదర్ రాజ నర్సింహా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో చెంచులు, గిరిజనులకు వైద్య వసతుల కల్పనపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, వైద్యారోగ్య శాఖల అధికారులకు మంత్రి రాజనర్సింహా దిశానిర్దేశం చేశారు.సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి చెంచు పెంట, గిరిజన గూడెంలో నివసించే ప్రతి వ్యక్తికి మెరుగైన వైద్యం అందేలా కార్యాచరణను రూపొందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. ఈ విషయమై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ, అటవీ శాఖ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. భౌగోళికంగా ఐటీడీఏ పరిధిలో అత్యవసర పరిస్థితుల్లో అరగంట లోపే వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆసుపత్రులకు చేరుకునేలా కార్యాచరణను రూపొందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా దిశానిర్దేశర చేశారు. గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు భౌగోళికంగా నెట్వర్క్ కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని దామోదర్ రాజ నర్సింహా చెప్పారు.

కబురు
KABURU TELUGU DAILY
శుక్రవారం అక్టోబర్ 04 2024

# నిజామాబాద్ బహిరంగ సభకు కార్యకర్తలు తరలిరావాలి.... పార్టీ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి





**- మంచి మనసున్న వ్యక్తి టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్... పార్టీ ఇంచార్జ్ ఏనుగు**

కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 3

యూత్ కాంగ్రెస్ కార్యకర్త స్థాయి నుంచి టీపీసీసీ అధ్యక్షుడిగా ఎదిగిన మహేష్ కుమార్ గౌడ్ మొదటిసారి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వస్తున్న సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గం నుండి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కనివిని ఎరగని రీతిలో ఘన స్వాగతం పలకాలని పార్టీ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం బాన్సువాడ పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచి మనసున్న వ్యక్తి, అందరిని కలుపుకొని పోయే వ్యక్తిత్వం ఉన్న బీసీ వర్గానికి చెందిన మహేష్ కుమార్ గౌడ్ కు పార్టీ అధిష్టానం టిపిసిసి అధ్యక్ష పదవి కట్టబెట్టినందుకు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈనెల 4న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ గ్రౌండ్ లో జరిగే సన్మాన సభకు కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి గణేష్, నాయకులు ప్రతాప్ సింగ్,ఎలమంచిలి శ్రీనివాసరావు, మాజీ జెడ్పిటిసి కొత్తకొండ భాస్కర్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాత బాలకృష్ణ, నసురుల్లాబాద్ పార్టీ మండల అధ్యక్షుడు నందు పటేల్, మత్స్య పారిశ్రామిక జిల్లా అధ్యక్షుడు గాధం సత్యనారాయణ,నాయకులు ఉద్దేర హన్మాండ్లు,కిషోర్ యాదవ్, వెంకటరెడ్డి, బండి సాయిలు యాదవ్, పుల్లేని బాబురావు, లయాక్,రహీం, శ్రీనివాస్ గౌడ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# స్వర్ణ కవచలం కృత దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 3

బాన్సువాడ పట్టణంలోని జ్ఞాన సరస్వతి దేవి ఆలయంలో దేవి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా గురువారం అమ్మవారు స్వర్ణ కవచలం కృత దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో దేవీ నవరాత్రుల సందర్భంగా ఆలయ అర్చకులు సంతోష్ శర్మ, విజయ్ శర్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ ధర్మకర్త పరిగె శంబు రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పరిగే శంభురెడ్డి, ఆలయ అర్చకులు సంతోష్ శర్మ, విజయ్ శర్మ, శ్రీనివాస్, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# తప్పిదాలకు తావులేకుండా సమగ్రంగా డిజిటల్ కార్డుల సర్వే







**- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...**

కబురు న్యూస్,నిజామాబాద్,అక్టోబర్ 03 :

కుటుంబ సభ్యుల వివరాల సేకరణ, డిజిటల్ కార్డుల జారీ కోసం పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు.నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని డిచ్పల్లి మండలం సాంపల్లిలో, ఆర్మూర్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని మున్సిపల్ వార్డు నెంబర్-2 పరిధిలో కొనసాగుతున్న డిజిటల్ కార్డుల సర్వే ప్రక్రియను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్యామిలీ డేటా బేస్ ఆధారంగా అధికారులు సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు.ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా అన్ని వివరాలను సక్రమంగా పొందుపర్చాలని అన్నారు.ఇంటి నెంబరు, చిరునామా,కుటుంబ యజమాని ఎవరు,ఇతర కుటుంబ సభ్యులకు యజమానితో గల సంబంధం వంటి వివరాలను పక్కాగా సేకరించాలని కలెక్టర్ సూచించారు.నిర్ణీత సమయంలోపు పైలెట్ సర్వేను పూర్తి చేయాలని,ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఏ ఒక్క కుటుంబం కూడా తప్పిపోకుండా నూటికి నూరు శాతం డిజిటల్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు.కాగా,డిజిటల్ కార్డుల పైలెట్ సర్వే కోసం జిల్లాలోని ఆర్మూర్ నియోజకవర్గానికి సంబంధించి రాంపూర్ గ్రామంతో పాటు ఆర్మూర్ మున్సిపల్ పట్టణంలోని వార్డు నెం-2 ను ఎంపిక చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.అదేవిధంగా బాల్కొండ సెగ్మెంట్లో బాల్కొండ మండలం శ్రీరాంపూర్,భీంగల్ మున్సిపల్ 7 వార్డును,బోధన్ నియోజకవర్గంలో బోధన్ మండలం లంగ్డాపూర్,బోధన్ మున్సిపాలిటీలోని 25వ వార్డును,నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి సంబంధించి 38, 45వ డివిజన్లను,నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలో డిచ్పల్లి మండలం సాంపల్లి,నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలోని 3వ డివిజన్ ను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి డిజిటల్ సర్వే ప్రక్రియ జరిపిస్తున్నామని కలెక్టర్ వివరించారు.కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీఓ రాజాగౌడ్,సంబంధిత అధికారులు ఉన్నారు.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

**30 ఏళ్లుగా విగ్రహ దాతగా నిలుస్తున్న నాగులగామా వెంకన్న గుప్తా**







కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 3

బాన్సువాడ పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్త నాగులగమా వెంకన్న గుప్తా హనుమాన్ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే దేవి నవరాత్రులలో భాగంగా సుమారు 30 సంవత్సరాలుగా మాతా విగ్రహాన్ని ప్రతి సంవత్సరం విగ్రహ దాతగా అందిస్తున్నారు. గురువారం తన నివాసంలో హనుమాన్ ఆలయ అర్చకులు ఆకాష్ అర్చకత్వంలో దేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవీ నవరాత్రుల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు ప్రతినిత్యం ప్రత్యేక పూజలతో పాటు, అమ్మవారు ప్రతిరోజు ప్రత్యేక రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. మొదటిరోజు అమ్మవారు స్వర్ణకవచలం కృత దుర్గాదేవి అమ్మవారిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు నార్ల ఉదయ్, ప్రధాన కార్యదర్శి రుద్రంగి గంగాధర్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు పాత బాలకృష్ణ, సంఘ నాయకులు నాగులగామ సాయిబాబా,పెద్ది రాజులు,ప్రమోద్, నార్ల కిరణ్, చిదూర వినయ్, పాత రాజేశ్వర్,గంప బాలకృష్ణ, సంఘ సభ్యులు, మహిళా సంఘ సభ్యులు ఉడుగుల విజయ, దనలక్మి ,గంప బాగ్య, నార్ల భాగ్య భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 356 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం.... జిల్లా కలెక్టర్

కబురు న్యూస్ కామారెడ్డి అక్టోబర్ 3



జిల్లాలో రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయడానికి 356 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోళ్ళు చేయడానికి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ 2024-25 సంవత్సరానికి గాను 356 ధాన్యం కొనుగోళ్ళు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం క్వింటాలు ధాన్యానికి కనీస మద్దతు ధర గ్రేడ్-ఏ రకానికి గాను రూ.2,320/-, కామన్ రకానికి రూ. 2,300/- మరియు సన్న వడ్లు విక్రయించే రైతులకు అదనంగా క్వింటాల్ కు రూ.500/-ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలను పరిష్కరించడానికి జిల్లా కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ 08468-220051 ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ జి.రాజేందర్, అసిస్టెంట్ జిల్లా పౌరసరఫరాల అధికారి కెవైఎల్ నరసింహా రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కో ఆపరేటివ్, మార్కెటింగ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితునికి ఎల్వోసి అందజేసిన పార్టీ ఇన్చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి



కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 3

వర్ని మండలంలోని జలాల్ పూర్ గ్రామానికి చెందిన రామా గౌడ్ అనారోగ్యంతో ఆసుపత్రిలో నిమ్స్ ఆస్పత్రిలో వైద్య ఖర్చుల నిమిత్తం గురువారం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి లక్ష 50 వేల ఎల్వో సి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎలమంచిలి శ్రీనివాసరావు, ప్రతాప్ సింగ్, పాత బాలకృష్ణ, నందు పటేల్, కిషోర్ యాదవ్,ఉద్దేరా హన్మాండ్లు, వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి గణేష్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలి... జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కబురు న్యూస్ కామారెడ్డి అక్టోబర్ 3

ఇటీవల డీఎస్సీ 2024లో ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో డీఎస్సీ ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1240 మంది డిఎస్సీ అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ధ్రువీకరణ పత్రాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈనెల 5వ తేదీ లోపు ధృవపత్రాల పరిశీలన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, తమదిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వార్డులో ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టిన మున్సిపల్ అధికారులు



కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 3

బాన్సువాడ మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డులో గురువారం ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టులో భాగంగా డిజిటల్ కార్డు ఇంటింటి సర్వేను మున్సిపల్ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ సభ్యుల యొక్క వివరాలను నమోదు చేసి, అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేసి డిజిటల్ కార్డులను అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మల్లి కార్జున్ రెడ్డి, నాయకులు అమీర్ చావుస్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాగారంలో డిజిటల్ సర్వేను పరిశీలించిన సబ్ కలెక్టర్ కిరణ్మయి



కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 3

బాన్సువాడ మండలంలోని నాగారం గ్రామంలో పైలట్ ప్రాజెక్టులో భాగంగా చేపడుతున్న ఇంటింటికి డిజిటల్ సర్వేను గురువారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి కోప్పిశెట్టి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ సర్వేను సంబంధిత అధికారులు కుటుంబ సభ్యుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బషీరొద్దిన్, ఎంపీఓ సత్యనారాయణ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా అమ్మ వారి విగ్రహ ప్రతిష్ట...



కబురు న్యూస్,బోధన్ అక్టోబర్03..





బోధన్ పట్టణంలో అమ్మ వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. దుర్గాదేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా గురువారం బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివ మందిరంలో సార్వజనిక్ దేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు గణేష్ మహారాజ్ వేద మంత్రోచ్చారణాల నడుమ అమ్మ వారి విగ్రహం ప్రతిష్ట చేశారు. ఈ సందర్బంగా ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకట నారాయణ లు విచ్చేసి అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సార్వజనిక్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మహేష్, కార్యదర్శి పవన్, కోశాధికారి శ్యామ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాది కలీం పై పోలీసుల దాడిని ఖండిస్తూ హుజురాబాద్ న్యాయవాదుల నిరసన

హుజురాబాద్: అక్టోబర్ 4, హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న కలీం సెప్టెంబర్ 28న మాదన్నపేట పోలీసుల దాడిని ఖండిస్తూ హుజురాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సెక్రెటరీ మట్టేల తిరుపతి మాట్లాడుతూ న్యాయవాదులను కించపరుస్తూ పోలీసులు మాట్లాడిన తీరును ఆయన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కలీంపై పరుష పదజాలంతో మాట్లాడి దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయవాదుల మీద జరుగుతున్న దాడులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.అలాగే న్యాయవాదుల రక్షణ కోసం చట్టం కూడా వెంటనే అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పులుగు లింగారెడ్డి, భూమిరెడ్డి, వై అరుణ్ కుమార్, జీ నరసింహస్వామి, శ్రీనివాస్, ఏ లింగం, సిహెచ్ భాను కిరణ్, ఏం రాజేందర్, మురళి, మౌనిక, సౌమిత్ర, హరిహరన్, కళ్యాణ్, కుమార్, ఆస్మినిమూర్తి ఉన్నారు

## దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న సలహాదారు పోచారం





కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 3

బాన్సువాడ పట్టణంలోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు అమ్మవారు శ్రీ స్వర్ణకవచలంకృత దుర్గా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు,ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పోచారం శంభు రెడ్డి, నాయకులు రేంజర్ల సాయిలు, సాయిరెడ్డి, భక్తులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి అధ్యక్షుని సన్మాన సభకు తరలిరావాలి.... కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్



కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 3

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 4న కలెక్టర్ గ్రౌండ్ లో జరిగే టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామ గ్రామాన నుండి ఈనెల 4న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ గ్రౌండ్ లో జరిగే బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఖలేక్ సొసైటీ అధ్యక్షులు కృష్ణారెడ్డి , గోపాల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి ,శంకర్ గౌడ్,మోహన్ రెడ్డి ,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఫ్యాషన్ మాల్ ను ప్రారంభించిన కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్





కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 3

బాన్సువాడ పట్టణంలోని తాడుకోల్ చౌరస్తాలోని ఎస్బిఐ బ్యాంక్ ఎదురుగా నూతనంగా ఏర్పాటుచేసిన విగ్నేశ్వర వస్త్ర దుకాణాన్ని గురువారం రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ బాలరాజ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు కాలేక్, అంజిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నార్ల సురేష్ గుప్తా, నాగులగామ శ్రీనివాస్,దాసరి శ్రీనివాస్ శ్రీనివాస్, రేంజర్ల సాయిలు, మోయిన్,వస్త దుకాణం యజమానులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ సర్వే పక్కాగా నిర్వహించాలి.. జిల్లా కలెక్టర్



కబురు న్యూస్ కామారెడ్డి అక్టోబర్ 3

ఇంటింటి కుటుంబ సర్వే పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని వార్డ్ నెంబర్ 6 లో కుటుంబ సర్వే పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ క్రింద చేపడుతున్న ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా పూర్తి సమాచారంతో నిర్వహించాలన్నారు. జిల్లాలోని మున్సిపల్, గ్రామాలలో పైలెట్ ప్రాజెక్ట్ క్రింద ఎంపిక చేసిన గ్రామాలలో సర్వే పనులు టీమ్ ల ద్వారా ఈ నెల 7 వరకు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రంగనాథ్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ ఇందు ప్రియ, మున్సిపల్ కమీషనర్ సుజాత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మచ్చేందర్





కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 3

కల్లేర్ మండలంలోని ఇంద్రానగర్ గ్రామంలోని రేణుక ఎల్లమ్మ, దత్తాత్రేయ దేవాలయంలో నూతనంగా కాళికామాత నవనాధుల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మచ్చేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు హెూమ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మారుతి, రాథోడ్ లక్ష్మీబాయి, రాజు నాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## శబ్ద కాలుష్యం ద్వారా జరిగే నష్టాలపై అవగాహన...



కబురు న్యూస్,బోధన్ అక్టోబర్03..

బోధన్ రూరల్ సర్కిల్, పట్టణానికి సంబంధించిన డిజె సౌండ్ సిస్టమ్ నిర్వాహకులతో పట్టణంలోని ఠాణాలో సమావేశం నిర్వహించి డిజే తో వచ్చే శబ్ద కాలుష్యం ద్వారా జరిగే నష్టాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఏసీపీ శ్రీనివాస్ హాజరై శబ్ద కాలుష్యం ద్వారా జరిగే నష్టాల గురించి నిర్వాహకులకు వివరించారు. నిజామాబాద్ కమీషనరేట్ పరిధిలో ఈనెల 14 వరకు శబ్ద కాలుష్య నియంత్రణ రూల్స్ కు సంబంధించిన నోటిఫికేషన్ అమల్లో ఉంటుందని తెలిపారు. డిజే సౌండ్ నిర్వాహకులు తప్పనిసరిగా లైసెన్స్ ను పొందాలని పేర్కొన్నారు. నిర్వాహకులు పోలీసులు అమలు చేసిన నిబంధనలు పాటించాలని సూచించారు. ఉల్లంఘించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో బోధన్ పట్టణ, రూరల్ సీఐలు వెంకట నారాయణ, విజయ్ బాబు ఉన్నారు.

# ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా కొనసాగేలా చేయాలి


## వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి..



- ఏ దశలోనూ అన్నదాతలు ఇబ్బంది పడకూడదు..
- రైతులను మోసగించేందుకు ప్రయత్నించే వారిపై క్రిమినల్ కేసులు..
- పొరుగు రాష్ట్రాల ధాన్యం రాకుండా సరిహద్దులలో గట్టి నిఘా..
- సన్న రకం, దొడ్డు రకం ధాన్యాలకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు..
- ఫిర్యాదులు స్వీకరించేందుకు వీలుగా కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు..
- సన్నాలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలి..
- ఈ నెల 9న ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేత..
- గడువు లోపు ధ్రువపత్రాల పరిశీలనను పూర్తి చేయాలని ఆదేశం..



**కబురు న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 03 :** ఖరీఫ్ లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్,పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తదితరులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు,పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు,అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ధాన్యం సేకరణ, ఉపాధ్యాయుల నియామక ప్రక్రియలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.ధాన్యం సేకరణను అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తూ, ఏ చిన్న పొరపాటుకు సైతం ఆస్కారం ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీ.ఎం సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 60.73 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ధాన్యం సాగు చేసినందున పెద్ద ఎత్తున దిగుబడులు చేతికందే అవకాశాలు ఉన్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సుమారు 7 వేల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. అవసరమైన పక్షంలో మరిన్ని కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈసారి దొడ్డు రకం, సన్న రకం ధాన్యాలకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ. 2320, సాధారణ రకానికి రూ. 2300 చొప్పున కనీస మద్దతు ధర చెల్లించడంతో పాటు, సన్న రకానికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ. 500 చొప్పున బోనస్ అందించనుంది తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సన్న ధాన్యంలో దొడ్డు రకం వడ్లు కలువకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, వేర్వేరు కేంద్రాల ద్వారా వీటిని కొనుగోలు చేయాలని సూచించారు. అదనంగా బోనస్ అందిస్తున్నందున ఇతర రాష్ట్రాల నుండి కూడా సన్న ధాన్యం ఇక్కడికి తరలించి విక్రయించేందుకు పలువురు ప్రయత్నించే అవకాశాలు ఉన్నందున, పొరుగు ధాన్యం రాకుండా సరిహద్దు ప్రాంతాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ విషయంలో పోలీసు శాఖ జిల్లా యంత్రాంగంతో సమన్వయము ఏర్పర్చుకుని సమర్ధవంతంగా పని చేయాలని పోలీస్ కమిషనర్లు, ఎస్పీలకు సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి కోడ్ నెంబర్ కేటాయిస్తూ, ఏ రకం ధాన్యం మిల్లులకు పంపిస్తున్నారన్న వివరాలను ధాన్యం బస్తాలపై రాయాలని అన్నారు.దీనివల్ల రైసుమిల్లులకు కేటాయించిన ధాన్యం నిల్వల్లో ఏవైనా అవకతవకలు జరిగితే, అవి ఏ కొనుగోలు కేంద్రం ద్వారా కేటాయించబడ్డాయన్నది సులువుగా నిర్ధారణ చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతుకు నష్టం వాటిల్లకుండా, ఇబ్బందులు ఎదురవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు.రైతులు ధాన్యం విక్రయించిన 48 గంటల వ్యవధిలో వారి ఖాతాలలో బిల్లులకు సంబంధించిన డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. ఎవరైనా రైతును మోసగించేందుకు, నష్టపర్చేందుకు ప్రయత్నిస్తే అలాంటి వారిని ఎంతమాత్రం ఉపేక్షించవద్దని, అవసరమైతే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీ.ఎం స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని సదుపాయాలూ అందుబాటులో ఉండేలా చూడాలని, ముఖ్యంగా గన్నీ



బ్యాగులు, తూకం యంత్రాలు, టార్పాలిన్లు సరిపడా సంఖ్యలో సిద్ధంగా ఉంచాలని, తాగునీరు, నీడ వంటి వసతులు కల్పించాలని సూచించారు. ఎక్కువ సంఖ్యలో హమాలీలు ఏర్పాటు చేసుకుని వెంటదివెంట ధాన్యం తూకం జరిగేలా, ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు రవాణా జరిగేలా చొరవ చూపాలన్నారు. ధాన్యం అమ్మకాలకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉంటే రైతులు తెలియజేసేందుకు వీలుగా జిల్లా స్థాయిలో టోల్ ఫ్రీ నెంబర్ తో కూడిన కంట్రోల్ రూమ్ ను నెలకొల్పాలని ఆదేశించారు.రైతుల నుండి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ,నిరంతరం పర్యవేక్షణ జరపాలని కలెక్టర్లకు సూచించారు. ఏ ఒక్క కొనుగోలు కేంద్రం కూడా అర్ధాంతరంగా మూతబడకుండా,రైతుల నుండి చివరి ధాన్యం గింజను సైతం కొనుగోలు చేసేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని,క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రభుత్వం దృష్టికి తేవాలని హితవు పలికారు. పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలని,నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చే రైతులకు పూర్తి స్థాయి మద్దతు ధర అందేలా చూడాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఉందన్నారు.సంబంధిత శాఖల అధికారులందరూ సమిష్టిగా,సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. రైతుల నుండి ఏ చిన్న ఫిర్యాదు సైతం రాకుండా చూసుకోవాలని,కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ చేసేందుకు సరిపడా గిడ్డంగులు,స్టోరేజ్ పాయింట్లను గుర్తించాలని సూచించారు.వచ్చే జనవరి మాసం నుండి రాష్ట్ర ప్రజలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం అందించనున్న దృష్ట్యా,రైతులు సన్న రకాలకు చెందిన వరి ధాన్యం పండించేలా ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో నూటికి నూరు శాతం సన్న ధాన్యం సాగుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అన్నారు.కాగా, రాష్ట్రంలో డీఎస్సీ-2024 ద్వారా 11062 టీచర్ పోస్టులను భర్తీ చేయనున్న నేపథ్యంలో,విజయదశమి పండుగకు ముందే ఈ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. డీఎస్సీ ద్వారా అర్హత సాధించిన అభ్యర్థులకు మెరిట్ లిస్ట్ ప్రకారం 1 : 3 నిష్పత్తిలో చేపడుతున్న సర్టిఫికెట్ల పరిశీలనను ఈ నెల 5 వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. 25231 మంది అభ్యర్థులకు గాను గురువారం మధ్యాహ్నం నాటికి 9090 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్ పూర్తయ్యిందని,మిగతా అభ్యర్థులకు సంబంధించిన పరిశీలన ప్రక్రియను కూడా గడువులోపు పూర్తి చేయాలని అన్నారు.నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఈ నెల 9న హైదరాబాద్ లోని లాల్ బహదూర్ స్టేడియంలో నియామక పత్రాలు అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు,పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్,అదనపు కలెక్టర్లు అంకిత్,కిరణ్ కుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం రమేష్, డీసీఓ శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ అధికారి గంగూబాయి,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగురవేద్దాం... బిఆర్ఎస్ నాయకులు షేక్ జుబేర్

**- ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి.. నాయకులు షేక్ జుబేర్**







**కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 3** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాలలో సర్పంచ్ ఎంపీటీసీ స్థానాలను బిఆర్ఎస్ తరపున పోటీ చేసిన వారే గెలిచి సత్తా చాటుతామని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ అన్నారు. గురువారం చందుర్ , రుద్రూర్ మండలాలతోపాటు వర్ని మండలంలోని జలాల్పూర్ జాకోర, లక్ష్మాపూర్, తదితర గ్రామాల్లో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశానికి సీనియర్ నాయకులు షేక్ జుబేర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేవలం ముఖ్యమంత్రి తన సీటు కాపాడుకోవడానికి పాకులాడుతున్నారని, ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టారన్నారు. ఆసరా పెన్షన్లు పెంచుతామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికి పెన్షన్ల ఉసేత్తకపోవడం దారుణమన్నారు. ప్రజా పాలలో తీసుకున్న దరఖాస్తుల ద్వారానే రేషన్ కార్డులు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు డిజిటల్ సర్వే పేరిట కాలయాపన చేస్తున్నారని, బిఆర్ఎస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గ్రామాలలో ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల బిఆర్ఎస్ నాయకులు సాయిలు, నారాయణ, శ్రీనివాస్ ,బాలయ్య,సోషల్ మీడియా ఇన్చార్జ్ అఫ్రోజ్, మాజీ సర్పంచ్ విట్టల్, శివ సూరి, రమేష్ యాదవ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు శ్రేయస్సు కోసమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు...

**- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి.**

**కబురు న్యూస్,బోధన్ అక్టోబర్ 03..**





రైతు శ్రేయస్సు కోసమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు. గురువారం బోధన్ మండలం లోని కల్దుర్కి గ్రామంలో సోసైటీ చేర్మెన్ శరత్ ఆధ్వర్యంలో సొయా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కారిక్రమానికి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై సొయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు సోయా పంట పండించి దళారులకు అమ్మి మోసపోతున్నారని రైతు శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 4892 రూపాయలు గిట్టుబాటు ధర అందిస్తుందని అన్నారు. రైతులందరూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలలోనే సోయా, వరి ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్ఫడ్ చైర్మన్ మార గంగారెడ్డి, డిసిసిబి డైరెక్టర్ గంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అంకు సంధ్య దామోదర్, టి పి సి సి డెలిగేట్ గంగా శంకర్, తహసిల్దార్ విటల్ ,నాయకులు నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శంకర్, మాజీ సర్పంచ్ నానా పటేల్,రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నీని ప్రారంభించిన నాయకులు ఆసుపత్వార్ వినోద్

**కబురు న్యూస్ జుక్కల్ అక్టోబర్ 3**



జుక్కల్ మండలంలోని పెద్ద ఎడిగి యువత ఆధ్వర్యంలో ప్రీమియర్ లీ క్రికెట్ టోర్నమెంట్ ను గురువారం కాంగ్రెస్ నాయకులు అస్పత్వార్ వినోద్, డాక్టర్ బండి వార్ విజయ్, ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం శారీరకంగా ఎంతో దృఢంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

కబురు
KABURU TELUGU DAILY
శుక్రవారం అక్టోబర్ 04 2024

# అర్హులైన ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు...





**కబురు న్యూస్,బోధన్ అక్టోబర్03..**

అర్హులైన ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు అందజేయడం జరుగుతుందని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అందించబోయే ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రాజెక్టులో భాగంగా బోధన్ శాసనసభ్యులు ప్రోద్దుటూరి సుదర్శన్ రెడ్డి సూచన మేరకు టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి లతో కలిసి బోధన్ మండలంలోని లంగ్దాపూర్ గ్రామంలో, పట్టణంలోని 25వ వార్డులో చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టు సర్వేను సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి, సిబ్బంది కి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, తహసీల్దార్ విఠల్, ఎంపీఓ మధుకర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వరుణ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా, మున్సిపల్ కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# నిజామాబాద్ రైల్వే స్టేషన్ లో స్వచ్ఛత పక్వాడ శ్రమదానం





**- స్వచ్ఛత జీవన విధానం కావాలి..**

**- రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ సాల్వన్ సంగ..**

**కబురు న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 03 :** స్వచ్ఛత ప్రతి ఒక్కరి జీవన విధానం కావాలని హైదరాబాద్ రైల్వే డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ సాల్వన్ సంగ తెలిపారు. నిజామాబాద్ జంక్షన్ రైల్వే స్టేషన్ లో గురువారం స్వచ్ఛత పక్వాడలో భాగంగా రైల్వే స్టేషన్ ప్లాట్ పామ్, రైల్వే ట్రాక్, తదితర ప్రదేశాలలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ రైల్వే డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ సాల్వన్



సంగ మాట్లాడుతూ,స్వచ్ఛత పక్వాడను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఒక్కరోజు కార్యక్రమంలా కాకుండా నిత్యజీవితంలో పరిశుభ్రత విధానాన్ని పాటించాలన్నారు. అపరిశుభ్ర పరిసరాల నుంచి పరిశుభ్రత దిశగా, అనారోగ్యం నుంచి ఆరోగ్య దిశగా,కాలుష్యం నుంచి స్వచ్ఛత దిశగా దేశాన్ని ముందుకు నడిపించే మహత్తర కార్యక్రమం స్వచ్ఛతా పక్వాడ అన్నారు. ప్రజల అలవాట్లలో పెనుమార్పు తీసుకువచ్చి పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీటవేసే అతిపెద్ద కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి ధర్మానాయక్, నిజామాబాద్ రైల్వే స్టేషన్ మేనేజర్ సదాశివుడు,హెల్త్ ఇన్స్పెక్టర్ ప్రేమ సాగర్,నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్,అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ దీప,కమర్షియల్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్,సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఉదయ్,నిజామాబాద్ జంక్షన్ రైల్వే సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలో కి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

**- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.**



**కబురు న్యూస్ దినపత్రిక మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి.**

అక్టోబర్ సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలో కి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,రాష్ట్ర రోడ్లురవాణ, బిసి సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ గౌతం హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ధాన్యం కొనుగొలు, డిఎస్సీ నియామకాలు అయిన రెండు అంశాల పై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 వేల ఐకేపీ సెంటర్లు ఉన్నాయని, అవసరమైన చోట కొత్త ఐకేపీ సెంటర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సూచించారు.రైతుల నుండి సన్నవడ్ల కొనుగోలుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, సన్నవడ్ల కు 500 రూపాయల బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపురు. ఐకేపీ సెంటర్ల కి సీరియల్ నెంబర్లు ఇవ్వాలి,సన్నవడ్ల పై ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని సిఎం సూచించారు. గతంలో లాగా గోనె సంచుల కొరతరాకుండా, ముందుగానే గోనె సంచులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు లో వ్యవసాయ అధికారులను ఇన్వాల్వ్ చేస్తూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కొనుగోలు చేసిన ధ్యానం వెంటనే తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని, ఐకేపీ సెంటర్లలో ధాన్యం తడవకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు కలెక్టర్లు రెండు గంటలు ధాన్యం కొనుగోలు పైన సమీక్ష జరిపి, ఏవైనా సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. కలెక్టరేట్ లో ధాన్యం కొనుగోళ్ల పైన కాల్ సెంటర్ ఏర్పాటు చేసి సమస్యలను ఎప్పటికప్పుడుపరిష్కరించాలన్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలో కి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటన లు చేయాల్సిందేనని సిఎం స్పష్టం చేసారు. తాలు, తరుగు, తేమ పేరు తో రైతులను మోసం చేసేవారిని సహించవద్దని, అవసరమైతే వారి పై క్రిమినల్ కేసు లు పెట్టాలని అన్నారు. రాష్ట్రంలో వంద శాతం రైతులు సన్నబియ్యం పండించేలా చొరవ చూపించాలని, వాతావరణ శాఖ నుంచి వచ్చే సూచనల ప్రకారం ఐకేపీ సెంటర్లలో ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి తెలిపారు.



డీఎస్సీ కి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిపికేషన్ 5 వ తేదీ లోగా పూర్తి చేసి, దసరా పండగ ముందే డిఎస్సీ నియామకాలు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి తెలిపురు. అక్టోబర్ 9 నియామక పత్రాలను అభ్యర్థులకు అందజేయాలని అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్సులో మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా నుండి డిసిపి సురేష్, అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, డిఈఒ విజయ కుమారి, వ్యవసాయ, పౌర సరఫరా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చూడాలి... సబ్ కలెక్టర్ కిరణ్మయి



**అక్రమ ఇసుక మొరం దందాలపై ఉక్కు పాదం మోపుతాం... సబ్ కలెక్టర్**

**కబురు న్యూస్ బాన్సువాడ అక్టోబర్ 3**

బాన్సువాడ రెవిన్యూ డివిజన్ పరిధిలోని అటవీ శాఖ అధికారులు, గనుల శాఖ అధికారులు, తహసిల్దార్లతో సబ్ కలెక్టర్ కిరణ్మయి తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రభుత్వ భూములను కబ్జా కాకుండా చూడాలని, అక్రమ ఇసుక, మొరం దందాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. అక్రమ ఇసుక మొరం రవాణాపై డివిజన్ పరిధిలో ఫిర్యాదులు వస్తున్నాయని సంబంధిత అధికారులు అక్రమ ఇసుక ,మొరం దందాకు అడ్డుకట్ట వేయాలని ఆమె సూచించారు. అటవీ భూములను ఆక్రమణకు కాకుండా సంబంధిత అధికారులు అనునిత్యం పర్యవేక్షణ చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసిల్దార్లు, ఫారెస్ట్ అధికారి హాబీబ్, సంబంధిత శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# బోడుప్పల్ కార్పొరేషన్ కు ప్రత్యేక నిధులు ఇవ్వండి

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బోడుప్పల్ మేయర్ వినతి**



**కబురు న్యూస్ దినపత్రిక మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి.**

బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కోరారు. ఈ మేరకు గురువారం నాడు ముఖ్యమంత్రి నివాసంలో శాసన మండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి,టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి,డీసీసీ అధ్యక్షుడు హరివర్దన్ రెడ్డిలతో కలిసి బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం కావాల్సిన నిధుల కోసం విజ్ఞప్తి చేశారు. బోడుప్పల్ కార్పొరేషన్ లో ప్రధాన సమస్యలైన ఎస్ఎన్డిపీ ప్రాజెక్టును పూర్తి చేసి ముంపు ప్రాంతాల సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. అదే విధంగా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని దళితులకు చెందిన అసైండ్ భూములకు పరిష్కారం చూపి వారికి న్యాయం చేసేలా చొరవ చూపాలని కోరినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా గత కొన్ని సంవత్సరాలుగా బోడుప్పల్ పది వేల కుటుంబాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన వక్ఫ్ భూమి సమస్యకు పరిష్కారం చూపి అక్కడి ప్రజలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

# శ్రీశ్రీశ్రీ జగదాంబ దేవి సహిత శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ పంచమ వార్షికోత్సవం

**- పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు శ్రీ వేములమహేష్ గౌడ్.**

**కబురు న్యూస్ దినపత్రిక మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి.**

శ్రీశ్రీశ్రీ జగదాంబ దేవి సహిత శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ పంచమ వార్షికోత్సవ ప్రత్యేక భోగ్ - భండార్ పూజ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు శ్రీ వేములమహేష్ గౌడ్ ఘట్కేసర్ మున్సిపల్, ఘనపురం గ్రామ పరిధిలోని పకీర్ టేక్య తండా లో కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ జగదాంబ దేవి సహిత శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయ పంచమ వార్షికోత్సవ పూజ కార్యక్రమం ఈరోజుఘనంగానిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ఆలయ పూజారి రామావత్ అమర్ సింగ్ మహారాజ్ తండా ప్రజల ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు శ్రీ వేముల మహేష్ గౌడ్ ప్రత్యేక భోగ్ - భండార్ పూజ కార్యక్రమంలో పాల్గొని శ్రీశ్రీశ్రీ జగదాంబ అమ్మవారిని,శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ని దర్శించుకోవడం జరిగింది. కార్యక్రమం లో మాజీ సర్పంచ్ లు నానావత్ రూప్ సింగ్ నాయక్, బద్దం గోపాల్ రెడ్డి, తండా నాయక్ వడ్త్యా రాజు నాయక్, కారోబారి నానావత్ హుస్సేన్ నాయక్, మేడ్చల్ నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షులు నానావత్ సురేష్ నాయక్, మాజీ వార్డు సభ్యులు వడ్త్యా చాంది, రామావత్ రాణి, బానోత్ కిషన్ నాయక్,వడ్త్యా పవన్ నాయక్, నాయకులు రామావత్ చందర్ సింగ్,బానోత్ రమేష్ నాయక్, వడ్త్యా సురేష్ నాయక్,వడ్త్యా దేవ్ సింగ్ నాయక్, మాలోత్ సురేష్ నాయక్, బానోత్ ప్రసాద్ నాయక్, మరియు తండా ప్రజలు, మహిళలు భక్తులు పాల్గొన్నారు.

# న్యాయవాది కలీం పై పోలీసుల దాడిని ఖండిస్తూ హుజురాబాద్ న్యాయవాదుల నిరసన



**కబురు న్యూస్ / హుజురాబాద్/ ప్రతినిధి**

హుజురాబాద్: అక్టోబర్ 4, హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న కలీం సెప్టెంబర్ 28న మాదన్నపేట పోలీసుల దాడిని ఖండిస్తూ హుజురాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సెక్రెటరీ మట్టేల తిరుపతి మాట్లాడుతూ న్యాయవాదులను కించపరుస్తూ పోలీసులు మాట్లాడిన తీరును ఆయన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కలీంపై పరుష పదజాలంతో మాట్లాడి దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయవాదుల మీద జరుగుతున్న దాడులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే న్యాయవాదుల రక్షణ కోసం చట్టం కూడా వెంటనే అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పులుగు లింగారెడ్డి, భూమిరెడ్డి, వై అరుణ్ కుమార్, జీ నరసింహస్వామి, శ్రీనివాస్, ఏ లింగం, సిహెచ్ భాను కిరణ్, ఏం రాజేందర్, మురళి, మౌనిక, సౌమిత్ర, హరిహరన్, కళ్యాణ్, కుమార్, ఆస్మినిమూర్తి ఉన్నారు

# క్రీడలపై అవగాహన పెంచుకొని...ఆలోచనతో ఆడండి:



గెలుపు,ఓటములు సహజం....

మంథని డీ.ఎల్.పీ.ఓ సతీష్:

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి: రామగుండం: అక్టోబర్ 03:కబురు న్యూస్, క్రీడలపై అవగాహన పెంచుకొని...ఆలోచనతో ఆడలని మంథని డీ.ఎల్.పీ.ఓ కొమ్మెర.సతీష్ అన్నారు. గురువారం సెంటినరీ కాలనీలో జేఎన్టీయూ కళాశాల స్టేడియంలో అండర్- 16 క్రికెట్ టోర్నమెంట్ ను ఆయన ప్రారంభించారు. క్రీడలు ఆడే చిన్నారులు పోటీ తత్వం పెంచుకోవాలని ఈర్ష, ద్వేషాలను వదిలివేయాలని ఆయన కోరారు. గెలుపు ఓటములను పట్టించుకోవదని, వాటిని సహజంగా తీసుకోవాలని సూచించారు. అయినప్పటికీ గెలుపు కోసం పోరాటం చేయాలని... పోరాటంలో నిర్లక్ష్యం వహించవద్దని కోరారు. ఈ సందర్భంగా సెంటినరీ కాలనీ, గోదావరిఖని కృష్ణవేణి పాఠశాల జట్లు పోటీపడ్డాయి.టీ-20 క్రికెట్ పోటీలను దసరా సెలవుల సందర్భంగా రత్నాపూర్ గ్రామానికి చెందిన పల్లె సాక్షిత్ రావు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలు శుక్రవారం ముగుస్తాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీఓ దేవరకొండ ఉమేష్,మాజీ వార్డ్ మెంబర్ తన్నీరు. ప్రదీప్ పాల్గొన్నారు.

# బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు సంజయ్ కుమార్ ను పరామర్శించిన ఉపాధ్యాయ ఎం.ఎల్.సి అభ్యర్థి పోలు సత్యనారాయణ...



కబురు న్యూస్,:శంకరపట్నం అక్టోబర్ మూడు

బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ జాతీయ నాయకులు జక్కని సంజయ్ కుమార్ ను గురువారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పోరు సత్యనారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు.బీసీల హక్కుల సాధన కోసం, కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని, కులగణన వెంటనే చేపట్టాలని, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం వాటా అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ను అమలు చేయాలని 9 రోజులు ఆమరణ దీక్ష చేసి అనారోగ్యం బాగోలేక హస్పత్రిలో చికిత్స పొందిన బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ ను కరీంపేట గ్రామంలో ఉపాధ్యాయ ఎంఎల్.సి అభ్యర్థి పోలు సత్యనారాయణ మరియు పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు గడ్డం శ్రీ రాములు, పద్మశాలి అధికారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ ఇతర నాయకుల ఆధ్వర్యంలో కలిసి పరామర్శించే ఆరోగ్య పరిస్థితిలో అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. విరోచిత పోరాటం చేసి బీసీ ఉద్యమాన్ని తట్టి లేపిన సంజయ్ కుమార్ ను ప్రశంసించారు, ఈ పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు, త్వరగా కోలుకోవాలని, ప్రజా క్షేత్రంలో ముందుకు సాగాలని హక్కుల సాధన కోసం ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమం తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కొండ సురేఖ పై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదు




కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి

కబురు న్యూస్, హుజురాబాద్/ ప్రతినిధి

మంత్రి కొండ సురేఖ పై సోషల్ మీడియాలో అసభ్యకరంగా చేయవాకులు ఆవాకులు మాట్లాడి ప్రచారం చేయిస్తున్న బి ఆర్ ఎస్, నాయకులపై నిరసనగా ఎర్రటి ఎండలో నడిరోడ్డుపై కూర్చొని కరీంనగర్ నడిబొడ్డున ఇంద్ర చౌక్ ప్రాంగణంలో ధర్నా చేసిన కరీంనగర్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గాని మహిళా నాయకులుగాని మంత్రి కొండ సురేఖ పై సోషల్ మీడియాలో ఎలాంటి విష ప్రచారాలు చేసిన చేవాకులు అవాకుల మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు గానీ కార్యకర్తలు గాని ఊరుకునేది లేదు ఖబర్దార్ అని ఆమె అన్నారు ఈ ధర్నా కార్యక్రమంలో హుజురాబాద్ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు యేముల పుష్పలత , జిల్లా ఉపాధ్యక్షురాలు సొల్లు సునీత, బ్లాక్ అధ్యక్షురాలు సుశీల,మండల అధ్యక్షురాలు లావణ్య, రాధ, రేణుక, స్వరూప, స్వప్న అన్ని మండలాల నుంచి వచ్చిన మహిళా కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బడంగ్పేట్ మున్సిపాలిటీ ఘోర అవమానం

- గాంధీ జయంతి నాడు శానిటేషన్ సిబ్బందికి ఘోర అవమానం
- సమాజం బాగు కోరే శానిటేషన్ సిబ్బందికి రక్షణ లేని చెత్త బండిలో ప్రయాణం
- ఇంత జరుగుతున్న పట్టించుకోని కమిషనర్ బీజేవైఎం అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి







మహేశ్వరం: రంగారెడ్డి జిల్లాకబురు న్యూస్, ప్రతినిధి: అక్టోబర్ 3. బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఈరోజు మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా శానిటేషన్ సిబ్బందికి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ లో సన్మాన కార్యక్రమం కమిషనర్ మరియు మేయర్ గారి ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ యొక్క కార్యక్రమానికి శానిటేషన్ సిబ్బందిని చెత్త బండిలో వారిని మున్సిపల్ కార్యాలయానికి తరలించారు ఇట్టి విషయంపై బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు గాంధీ జయంతి నాడు ఇలా శానిటేషన్ సిబ్బందిని అవమానించడం మరియు శానిటేషన్ సిబ్బంది ప్రతిరోజు మన బాగు కోరే వ్యక్తులు అలాంటి వ్యక్తులకు ఇలాంటి అవమానం జరగడం చాలా బాధాకరమని వారికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో కమిషనర్ గారు విఫలమయ్యారని ధ్వజమెత్తారు.

# శ్రీనివాస్ గౌడ్ కు నామినేట్ నామినేటెడ్ పోస్ట్ ఇవ్వాలి....

- 40 ఏళ్ల నుండి కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్న శ్రీనివాస్ గౌడ్....
- గత ప్రభుత్వంలో ఎన్ని ఒత్తిళ్లు వచ్చిన తలొగని శ్రీనివాస్ గౌడ్....
- మంత్రి, ఎమ్మెల్యే, కృషి చేయాలి...
- పార్టీ మండలాధ్యక్షుడు బసవయ్య....





కబురు న్యూస్,శంకరపట్నం అక్టోబర్ 3

కాంగ్రెస్ పార్టీకి 40 ఏళ్ల నుండి సేవలందిస్తున్న బత్తిని శ్రీనివాస్ గౌడ్ కు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గము స్పందించి రాష్ట్ర నామినేటెడ్ పోస్ట్ కట్ట పెట్టాలని కాంగ్రెస్ పార్టీ శంకరపట్నం మండల అధ్యక్షుడు బసవయ్య అధిష్టానాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం శంకర పట్నం మండలం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను కలిసేందుకు మండల నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బసవయ్య మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన బత్తిని శ్రీనివాస్ గౌడ్ 40 ఏళ్ల నుండి కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నాడని యువజన నాయకుడిగా, గ్రామ ఎంపీటీసీగా, మండల జడ్పిటిసిగా సేవలందించి, 2009 లో నూతనంగా ఏర్పడిన మానకొండూర్ శాసనసభకు నాటి జిల్లా పరిషత్ చైర్మన్ ఆరెపల్లి మోహన్ కాంగ్రెస్ పార్టీ నుండి మొదటిసారిగా పోటీ చేసిన మోహన్ ను తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమం రూతలూగుతున్న సమయములో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆరేపల్లి మోహన్ పోటీ చేస్తే ఆయన గెలుపు కోసం శ్రీనివాస్ గౌడ్ కృషిచేసి మోహన్ గెలుపుకు కీలక భూమిక పోషించారని, నాటి ఎమ్మెల్యే మోహన్, కరీంనగర్ ఎంపీగా పొన్నం ప్రభాకర్ గౌడ్ గెలుపుకు కృషి చేసిన శ్రీనివాస్ గౌడ్ ను 2014 తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో నాటి టిఆర్ఎస్ నేటి బిఆర్ఎస్ నేతలు ఎమ్మెల్యేగా గెలిచిన రసమయి బాలకిషన్, బి ఆర్ఎస్ పార్టీలోకి రావాలని, ఆహ్వానించిన సున్నితముగా తిరస్కరించి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోసం వారికి అండగా ఉండేందుకు ఎన్ని ఒత్తిళ్లకు గురి అయిన తట్టుకొని 40 ఏళ్ల నుండి కాంగ్రెస్ పార్టీకి మండలాన్ని నమ్ముకున్న కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు అండగా ఉంటున్న బత్తిని శ్రీనివాస్ గౌడ్ కు రాష్ట్ర నామినేటెడ్ పోస్టు కేటాయించాలని అందుకు రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ను, శంకరపట్నం మండల పార్టీ ఆధ్వర్యంలో కలిసి విన్నవించేందుకు బయలుదేరి వెళుతున్నట్లు బసవయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిరుపతి గౌడ్, బండారి తిరుపతి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహమ్మద్ ఇసాముద్దీన్, బీసీ సెల్ మండలాధ్యక్షుడు నాంపల్లి తిరుపతి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బొజ్జ చంద్రమౌళి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మీర్జా బేగ్, తాజా మాజీ ఉపసర్పంచ్, శంకర్, కుమార్ ,శ్రీనివాస్, వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గరిగే ప్రభాకర్, కీసర సంపత్, తిరుపతి, దేవరాజు, శ్రీనివాసరెడ్డి, ధర్మారెడ్డి, రైస్ మిల్లర్స్ జిల్లా డైరెక్టర్ గాజుల శ్రీనివాస్, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మల్కాజ్గిరి, వినాయకనగర్ డివిజన్ లో హైడ్రా బాధితులతో ఎంపీ ఈటల రాజేందర్.

కబురు న్యూస్,దినపత్రిక మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి.







35 ఏళ్ల క్రితం బండ చెరువు చుట్టూ కాలనీలు శివానంద నగర్, కృష్ణ నగర్, ఆర్టీసీ కాలనీ, శంకరయ్య కాలనీ, పిబి కాలనీ, పిబి సూర్య కాలనీ, బృందావన్ కాలనీ, సంతోషిమా కాలనీ, సింహాద్రి కాలనీ, ఎన్బిసి కాలనీ, శివగౌరీ కాలనీ, లక్ష్మీ నగర్, జైన్ మందిర్, చంద్రగిరి కాలనీ, లాల్వాని నగర్, సప్తగిరి కాలనీ, అనంతసాగర్.. ఇలాదబండ చెరువు చుట్టూ 18 కాలనీలు 35 సంవత్సరాల క్రితం ఏర్పడ్డాయి. చిరు ఉద్యోగులు, రోజువారి కూలీలు, పేదవారు జాగాలు కొనుక్కొని ఒక తరం కష్టపడి ఇల్లు నిర్మించుకున్నారు.చనిపోతే అనాథ శవాలలాగా పడవేయొద్దని సొంత ఇల్లు కోసం పేదవాడు తాపత్రయపడతారు.ఒకవైపు పేదల ఇండ్లకు కూలగొట్టం నిశ్చింతంగా ఉండండి అని రేవంత్ రెడ్డి, రంగనాథ్ చెప్తూ మరోపక్క ఎఫ్టిఎల్ బఫర్ జోన్ల పేరుతో మార్కింగ్ చేస్తున్నారు.ముఖ్యమంత్రిని ఒకటే అడుగుతున్నాను నీవు బాధ్యతగా గల మనిషిని..చెరువులు చుట్టూ ఇల్లు లక్షల సంఖ్యలో ఉంటాయి.నీకు ఓటు వేసి గెలిపించిన పాపానికి లక్షలాది ఇళ్లలో కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు. శనివారం ఆదివారం వస్తే ఎక్కడ బుల్ డోజర్లు వస్తాయి అని బిక్కుబిక్కుమంటూ బ్రతకడానికి కారణం రేవంత్ రెడ్డి నువ్వు కాదా

ప్రజల కళ్ళలో నీళ్లు చూసి సంతోషపడేవాడు మనిషి కాదు శాడిస్ట్ అవుతారు. నాకు కోర్టులు, చట్టాలు, రాజకీయ నాయకులు లెక్క కాదు అని హైడ్రా అధికారులు మాట్లాడుతున్నారు. నిర్మాణం చేయడం కష్టం.. రక్తాన్ని చెమటగా మార్చి పైస పైసా జమ చేసుకొని కట్టుకుంటే.. క్షణాల్లో కూల్చివేసే అధికారం నీకు ఎవరిచ్చాడు నువ్వు ఎవరివి

హైదరాబాద్ మునిగిపోవాలని, వరదలు రావాలని, అక్రమ నిర్మాణాలు చేపట్టాలని ఎవరు కోరుకోవడం లేదు.

కానీ హైదరాబాదులో చెరువులన్నీ మురికి కూపాలుగా మారిపోయాయి. పక్కనే ఉన్న బోర్లలోకి ఆ నీళ్లు వచ్చి కలషితమవుతున్నాయి.

హుస్సేన్ సాగర్ చుట్టూ ఐమ్యాక్స్, ఎన్టీఆర్ ఘాట్, నక్లెస్ రోడ్, బిర్యానీ సెంటర్లో వస్తే ఓకేనా.పేదల బ్రతుకుల్లో మట్టి కొడుతున్న దుర్మార్గ ప్రభుత్వం రేవంత్ రెడ్డిది.

కోర్టులు మొట్టికాయలు వేసిన తర్వాత కూడా జ్ఞానం రావడం లేదు సెన్సిటైస్ కావడం లేదు.

హైడ్రాబాధితులు అందరితో కలిసి త్వరలో దీక్ష చేస్తాను. మీరంతా నిశ్చింతగా ఉండండి.

రేవంత్ రెడ్డి నీకు కొడంగల్లో ఓడిపోతే మల్కాజ్గిరి ప్రజలు ప్రాణం పోశారు. హైదరాబాదులో ఎక్కువ చెరువులు ఎక్కువ హైడ్రాబాధితులు మనోవేదన పడుతున్నవారు మల్కాజ్గిరి ప్రజలే. మల్కాజ్గిరి ప్రజలు ఏం పాపం చేశారు.కొడంగల్ లో బొందపెడితే.. ఇక్కడికి వచ్చి బిక్షపెట్టమని అడిగితే గెలిపిస్తే వారి మీద కక్ష తీర్చుకోవడం ఎంతవరకు భావ్యం అని అడుగుతున్నాను.

ఎంత పెద్ద పదవులు కాదు ఎంత మందితో శభాష్ అనిపించుకున్నది ఇంపార్టెంట్. ప్రజల ఆవేదన చూడండి.

వాళ్ళ ఆవేదన తో మాట్లాడుతుంటే డబ్బులు ఇచ్చి మాట్లాడిస్తున్నామని చెప్పడం ప్రజలను అవమానించడమే.

మీ ఇంటిలిజెన్స్ రిపోర్ట్ తీసుకోండి. ప్రజలతో గోక్కున్నవాడు ఎవరూ బాగుపడలేదు మీరు కూడా మట్టి కొట్టుకపోవడం ఖాయం.

64 సీట్లు వస్తేనే మిడిసిపడి ఇబ్బంది పెడుతున్నావు.

అధికారులారా బాసుల ఆదేశాల ప్రకారం వచ్చి పిచ్చిపిచ్చి పనులు చేస్తే జైలకు పోవడం కాయం. అధికారం ఇచ్చిన ఖర్మానికి వేదనకు గురి చేస్తున్నారు. హైదరాబాదులోనే కాదు రాష్ట్రమంతా హైడ్రా విస్తరిస్తుందట. నాలికనా తాటి మట్టనా.. పేదల జోలికి రాను అని ఒక పక్క చెప్తావు మరోపక్క వచ్చి ఇండ్లకు రెడ్ మార్కులతో మార్కింగ్ ఎందుకు వేస్తున్నారు. 50 ఏళ్ల క్రితం కట్టుకున్న ఇళ్లకు మార్కులు వేస్తే వారు ఎటుపోవాలి. రేవంత్ రెడ్డికి నడమంత్రపు సిరి వస్తే ప్రజలను ఇబ్బంది పెడుతున్నాడు. మంత్రులు కూడా తానా అంటే తందానంటున్నారు.

మీరు ఎందుకు ప్రజల పక్షాన ముఖ్యమంత్రికి చెప్పడం లేదు. ప్రజల దుఃఖం పట్టదా. ఇన్ని రోజుల నుంచి ఎంపీగా ప్రజల ఆవేదనను ఆవిష్కరిస్తున్నాను ఒక్క నాడన్న మీ బాధ ఏంది అని అడిగే ప్రయత్నం చేశారా. పిచ్చి వేషాలు బందు చేసుకో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు. కాలుకు ముల్లు గుచ్చుకుంటే పన్నుతో పీకే పని చేస్తానని మాట ఇచ్చి వచ్చాము అలానే పనిచేస్తాను. నాకు ప్రజల కన్నీళ్ళతో సంబంధం రాజకీయాలతో కాదు.




# మీ రాజకీయ ప్రయోజనాల కోసం నా పేరు వాడొద్దు: రకుల్

కబురు సినిమా అక్టోబర్ 3..

తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేసే క్రమంలో ఆమె తీవ్ర పదజాలం ఉపయోగించారు. కేటీఆర్ కారణంగా కొందరు హీరోయిన్లు త్వరగా పెళ్లి చేసుకుని ఇండస్ట్రీ నుంచి వెళ్లిపోయారని ఆరోపించారు. ఈ సందర్భంగా రకుల్ ప్రీత్‌సింగ్ పేరును కూడా ప్రస్తావించారు. అంతేకాదు, సమంత, నాగచైతన్య, నాగార్జున పేర్లను కూడా తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో రకుల్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. తనకు ఏ వ్యక్తి/రాజకీయ పార్టీతో సంబంధం లేదని ప్రకటించారు.సృజనాత్మకత, వృత్తి నిపుణతకు తెలుగు చలనచిత్ర ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఈ అందమైన తెలుగు ఇండస్ట్రీలో నాది గొప్ప ప్రయాణం. ఇప్పటికీ ఇండస్ట్రీతో సత్సంబంధాలు కలిగి ఉన్నాను. ఒక మహిళ గురించి దారుణమైన, దుర్మార్గమైన నిరాధార ఆరోపణలు చేయడం విని బాధగా అనిపించింది. బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న మరో మహిళ ఇలా వ్యాఖ్యానించడం మరింత బాధించింది. హుందాగా వ్యవహరించాలనే ఉద్దేశంతోనే మేమంతా నిశ్శబ్దంగా ఉన్నాం. కానీ, అదే మా బలహీనత అనుకోవద్దు. నేను రాజకీయాలకు దూరంగా ఉండే వ్యక్తిని. నాకు ఏ వ్యక్తి/రాజకీయ పార్టీతో సంబంధం లేదు. రాజకీయ ప్రయోజనాల కోసం నా పేరును ఉపయోగించవద్దని కోరుతున్నా. నటులు, సృజనాత్మకత కలిగిన వ్యక్తులను రాజకీయాలకు దూరంగా పెట్టండి. వార్తల్లో నిలిచేందుకు వారి పేర్లను వాడుకొని కల్పిత కథనాలను సృష్టించవద్దు –సినీ నటి రకుల్ ప్రీత్‌సింగ్

# మంత్రి కొండా సురేఖపై పరువు నష్టం దావా వేసిన నాగార్జున

కబురు సినిమా అక్టోబర్ 3..




సినీ నటుడు అక్కినేని నాగార్జున కుటుంబాన్ని, వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నాగార్జున ఆమెపై పరువు నష్టం దావా వేశారు. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠ దెబ్బతీసేలా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ నాంపల్లి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.మరోవైపు మంత్రి సురేఖ వ్యాఖ్యలపై చిత్ర పరిశ్రమ వర్గాలు మండిపడ్డాయి. బాధ్యతాయుతమైన పదవిలో ఒక మహిళా మంత్రిగా ఉండి, మరో మహిళ పేరు ప్రస్తావించడం, రాజకీయాలతో సంబంధం లేని అక్కినేని కుటుంబాన్ని వివాదంలోకి లాగడం సరైనది కాదంటూ సామాజిక మాధ్యమాల వేదికగా వరుస పోస్టులతో అసహనం వ్యక్తం చేశారు.

# బ్రేకప్ అంటూ రితేశ్ మెసేజ్.. కంగారుపడ్డా: జెనీలియా

కబురు సినిమా అక్టోబర్ 3..

'బొమ్మరిల్లు'తో తెలుగువారికి బాగా చేరువైన నటి జెనీలియా . బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ తో వివాహం అనంతరం ఆమె ముంబయిలో సెటిలైన విషయం తెలిసిందే. ఈ జంటకు సినీ ప్రియుల్లో మంచి ఫాలోయింగ్ ఉంది. తరచూ సరదా వీడియోలు చూస్తూ క్యూట్ కపుల్‌గా పేరు తెచ్చుకున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జెనీలియా.. తన భర్త రితేశ్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. రితేశ్ చాలా సింపుల్, లవ్లీ పర్సన్ అన్నారు. ఆయన్ని పెళ్లి చేసుకోవడం తాను తీసుకున్న మంచి నిర్ణయాల్లో ఒకటన్నారు. డేటింగ్‌లో ఉన్నప్పుడు ఊహించని చర్యలతో ఆయన షాక్‌కు గురిచేసేవాడన్నారు."మేము డేటింగ్‌లో ఉన్నప్పుడు ఒక సంఘటన జరిగింది. దానిని నేను ఎప్పటికీ మర్చిపోలేను. రితేశ్‌కు ఆలస్యంగా నిద్రపోవడం అలవాటు. నేనేమో చాలా త్వరగా నిద్రలోకి జారుకుంటా. ఓరోజు ఏమైందో ఏమో తెలియదు.. అర్ధరాత్రి 1 గంటకు రితేశ్ నాకొక సందేశం పంపారు. "ఇక, అంతా అయిపోయింది" అంటూ అదొక బ్రేకప్ సందేశం. తెల్లవారుజామున ఆ సందేశం చూసి నేను షాకయ్యా. చాలా బాధగా అనిపించింది. ఏం జరిగిందో? ఆయన ఎందుకు ఇలా చెప్పారో? అర్థం కాక సతమతమయ్యా. నిద్రలేచిన తర్వాత తాను పంపిన సందేశం గురించి రితేశ్ పూర్తిగా మర్చిపోయారు. ఫోన్ చేసి "ఏం చేస్తున్నావు?" అని అడిగారు. నాకు కోపం వచ్చేసింది. "ఇకపై మనం మాట్లాడుకోకపోవడం మంచిది. నువ్వేం అనుకుంటున్నావు. ఏం జరగనట్లు అలా, ఎలా మాట్లాడుతున్నావు?" అని కేకలు వేశా. రాత్రి జరిగింది గుర్తు చేసుకుని.. తాను కేవలం జోక్‌గా ఆ సందేశం పంపినట్లు చెప్పారు" అని జెనీలియా తెలిపారు.2003లో విడుదలైన 'తుజే మేరీ కసమ్' కోసం జెనీలియా, రితేశ్ తొలిసారి కలిసి వర్క్ చేశారు. ఆ సినిమా చిత్రీకరణ సమయంలో వీరి మధ్య ఏర్పడ్డ పరిచయం ప్రేమగా మారింది. ఆపై దాదాపు పదేళ్లు డేటింగ్‌లో ఉన్నారు. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో 2012లో వివాహం చేసుకున్నారు. 2022లో వీరిద్దరూ కలిసి యాక్ట్ చేసిన 'వేద్' మంచి విజయాన్ని అందుకుంది. 'మజిలి'కి రీమేక్‌గా తెరకెక్కిన మరాఠీ మూవీ ఇది.

# రజనీకాంత్ తాజా హెల్త్ అప్‌డేట్



కబురు సినిమా అక్టోబర్ 3..

అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ఇటీవల ఆసుపత్రిలో చేరిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. సెప్టెంబర్ 30న రజనీకాంత్ చెన్నైలోని ఆసుప్రతిలో చేరారు. ఆయనకు వైద్యులు శస్త్రచికిత్స చేసి గుండెలో స్టెంట్ వేశారు. అయితే రజనీ ఈరోజు డిశ్చార్జ్ కావాల్సిఉండగా.. వైద్యుల సూచన మేరకు మరో రోజు అబ్జర్వేషన్‌లో ఉంచినట్లు తమిళ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని శుక్రవారం ఆయన డిశ్చార్జ్ కానున్నట్లు తెలుస్తోంది.రజనీకాంత్ గుండె నుంచి బయటకు వచ్చే ప్రధాన రక్తనాళంలో వాపు ఏర్పడింది. దీనికి ట్రాన్స్‌కాథెటర్ పద్ధతి ద్వారా వైద్యులు చికిత్స అందించి స్టెంట్ అమర్చారు. రజనీ ఆసుపత్రిలో చేరినట్లు తెలియగానే అభిమానులతో పాటు సినీ, రాజకీయ ప్రముఖులు ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, హీరో కమల్‌హాసన్, విజయ్ రజనీ త్వరగా ఇంటికి తిరిగిరావాలని ఎక్స్ వేదికగా కోరుకున్నారు. ప్రధాని మోదీ కూడా రజనీ భార్య లతాతో ఫోన్‌లో మాట్లాడి ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ అగ్ర కథానాయకుడుప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తున్నారు. తాజాగా 'వేట్టయాన్' ట్రైలర్ విడుదలై మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. టీజే జ్ఞానవేల్ తెరకెక్కించిన ఈ చిత్రం అక్టోబర్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది.

# దేవర విజయోత్సవ వేడుక సక్సె మీట్ పెట్టలేక పోయామన్న నాగవంశీ

కబురు సినిమా అక్టోబర్ 3..

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన 'దేవర' మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ సినిమా సక్సెస్ మీట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ విషయంపై నిర్మాత నాగవంశీ పోస్ట్ పెట్టారు. ఈ ఈవెంట్‌ను భారీగా నిర్వహించాలని అనుకున్నప్పటికీ అనుమతులు లభించలేదని తెలిపారు. సక్సెస్ మీట్‌ను నిర్వహించలేకపోతున్నందుకు అభిమానులను క్షమాపణలు కోరారు. 'దేవర'ని ఈ స్థాయిలో ఆదరించినందుకు అందరికీ ధన్యవాదాలు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంలో సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు. ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించలేకపోవడంతో విజయోత్సవ వేడుకనైనా ఘనంగా చేయాలని ఎన్టీఆర్ ఎంతో భావించారు. మేము ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ దసరా, దేవీ నవరాత్రి ఉత్సవాలు ఉన్న కారణంగా మా వేడుకకు రెండు తెలుగు రాష్ట్రాల్లో బహిరంగ వేదికలకు అనుమతులు పొందలేకపోయాం. ఈ పరిస్థితి మా నియంత్రణలో లేదు. ఈ ఈవెంట్‌ను నిర్వహించలేకపోతున్నందుకు అభిమానులను క్షమాపణలు కోరుతున్నాం. వేదిక అనుమతి కోసం మేము ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నాం. మీ ప్రేమతో ఎన్టీఆర్ మరింత ఎత్తుకు ఎదగాలని ఆశిస్తున్నానని పోస్ట్ పెట్టారు. ప్రీ సేల్




బుకింగ్స్‌లోనే హవా కొనసాగించిన 'దేవర'.. విడుదలయ్యాక కూడా మంచి కలెక్షన్లు సొంతం చేసుకుంటోంది. ఇప్పటివరకు రూ.396 కోట్లు వసూలు చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం తాజాగా ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రంలో ఎన్టీఆర్ సరసన జాన్వీకపూర్ అలరించగా విలన్‌గా సైఫ్ అలీఖాన్ కనిపించిన సంగతి తెలిసిందే.

# సినిమా వాళ్లను టార్గెట్ చేయడం ఫ్యాషన్ మండిపడ్డ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

కబురు సినిమా అక్టోబర్ 3..

తెలంగాణ మంత్రి కొండా సురేఖ వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీనియర్ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తెలిపారు. బాధ్యతగల పదవిలో ఉన్నవారు జాగ్రత్తగా మాట్లాడాలని హితవు పలికారు. మంత్రిగా కొండా సురేఖకు ఏం తెలుసో తెలీదో గానీ.. ముందు గైడ్ లైన్స్ ఫాలో కావాలని విమర్శించారు. ప్రతి ఒక్కరికీ సినిమా ఇండస్ట్రీలో వారిని టార్గెట్ చేసి మాట్లాడటం తమాషా అయిపోయిందంటూ మండిపడ్డారు. చిత్ర పరిశ్రమ, అందులో పని చేసే వారంటే ఎందుకు అంత చులకన అని ఆయన ప్రశ్నించారు. ఇలాంటివి రిపీట్ కాకుండా ఉండాలని



కోరుకుంటున్నాను అని అన్నారు. మరో దర్శకుడు హరీశ్ శంకర్ కూడా ఘాటుగా స్పందించారు. 'అక్కినేని నాగార్జున కుటుంబం పై కొండా సురేఖ మాట్లాడిన తీరు చాలా బాధాకరం. రాజకీయ ప్రయోజనాల కోసం సినిమా వారిని టాగట్ చేయడం శోచనీయం. రాష్ట్రాల్లో ఎప్పుడు ఏ విపత్తు వచ్చినా మేమున్నామంటూ మొదటగా ముందుకు వచ్చే సినిమా వారిని చులకన చేస్తూ మాట్లాడటం తప్పుడు సంప్రదాయం. సురేఖ గారు ఇది మొదలెట్టింది మీరే.. దీన్ని సంస్కారవంతంగా ముగించాల్సిన బాధ్యత కూడా మీదే' అని హరీశ్ శంకర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com